



మదనపల్లెలోని పోతబోలు కాలనీలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

జగనన్న మోసం..

పేదలందరికీ ఇళ్లు మేమే కట్టించి ఇస్తాం.. మూడు నెలల్లో ఇంటి తాళాలు మీ చేతుల్లో పెడతాం.. ఇదీ 2019లో అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన మాట. పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన లెక్కలేని హామీలను నమ్మినట్టే.. వెర్రి జనం ఈ మాటలు విని సంబరపడ్డారు. అయితే జగన్ మాటల్లోని తీయదనం.. చేతల్లో కనిపించదని తెలియడానికి ఐదేళ్లు పట్టింది. 2019 ఎన్నికల్లో 151 సీట్లతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కడం.. 2024 ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమై.. ఆ ముఖ్యమంత్రి పీఠం దిగడమూ అయిపోయాయి. అయితే ఇప్పటికీ జగనన్న కాలనీల్లో ఇళ్లు మాత్రం పూర్తి కాలేదు. దీంతో జగనన్న మాటలతో మోసపోయి.. అప్పుల భారాన్ని నెత్తికి ఎత్తుకున్నామని జగనన్న కాలనీల లబ్ధిదారులు వాపోతున్నారు.

లబ్ధిదారులకు అప్పుల భారం

- సమస్యల వలయంలో జగనన్న కాలనీలు
- రోడ్లు లేవు.. నీళ్లు లేవు.. కరెంటూ లేదు
- ఇళ్లెట్లా కట్టేది... లబ్ధిదారుల ఆవేదన
- పూర్తయిన ఇళ్లు 42 శాతమే..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల పేరిట 78,221 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. అయితే ఈ కాలనీలను గుట్టలు, కొండలు, వాగులు, వంకల్లో ఊరికి దూరంగా ఇవ్వడంతో ఇప్పటికీ కేవలం 32,999 (42 శాతం) మాత్రమే ఇళ్లు పూర్తయ్యాయి. ఇంకా సుమారు 9032 ఇళ్ల నిర్మాణం మొదలే కాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఆర్భాటంగా చెప్పినప్పటికీ ఆచరణలో ఆ మేరకు లబ్ధిదా రులకు సౌకర్యాలు కల్పించలేదు. ఇప్పటికీ జిల్లాలోని చాలా జగనన్న కాలనీలలో కనీస మౌలిక వసతులు లేవు. కాలనీలకు వెళ్లడానికి సరైన రోడ్లు లేవు. ఆ కాలనీల్లో సైతం మట్టి రోడ్లే ఉన్నాయి. సీసీ రోడ్లకు మోక్షం కలగలేదు. నీటి వసతి లేదు. కరెంటు సౌకర్యమూ లేదు. ఫలితంగా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు మొగ్గు చూపడం లేదు.

జిల్లా కేంద్రం రాయచోటి పట్టణ ప్రజల కోసం ప్రధానంగా నారాయణరెడ్డిపల్లె పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీని పరిశీలిస్తే జిల్లాలో జగనన్న కాలనీల్లో పరిస్థితి ఎలా ఉందో ఇట్టే తెలిసిపోతుంది. ఈ కాలనీలో 6 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. ఇప్పటికీ పూర్తయిన ఇళ్లు 40 శాతం లోపే ఉన్నాయి. ఇక్కడ లబ్ధిదారుల కథనం మేరకు.. ప్రధానంగా నీళ్ల సమస్య ఉంది. దీంతో ఇళ్లు నిర్మించుకోవడానికి కష్టంగా ఉంది. కాలనీలో ఏర్పాటు చేసిన బోర్లలో వచ్చే చాలీచాలని నీళ్లనే వాడుకోవాల్సి వస్తోంది. కాలనీలో సరైన విద్యుత్ సౌకర్యం లేదు. వీధి రోడ్లు సక్రమంగా లేవు. దీంతో రాత్రివేళల్లో నడవడానికే భయపడుతున్నారు. కాలనీలో ఎక్కడ చూసినా మనకు పునాదులే కనిపిస్తాయి. గతంలో ఇసుక, సిమెంటు, నిర్మాణానికి వినియోగించే కట్టుడురాళ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో చాలామంది ఇంటి నిర్మాణాల జోలికి వెళ్లలేదు. కొంతమంది విధిలేని స్థితుల్లో.. అప్పోసప్పో చేసి ఇళ్లు నిర్మించుకుని అసౌకర్యాల నడుమ జీవనం సాగిస్తున్నారు.



రాయచోటిలోని నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీ

- ములకలచెరువుకు రెండు కిలోమీటర్ల దూరంలో ములకలచెరువు-తంబళ్లపల్లె రోడ్డు పక్కన ఉన్న గుట్టను చదును చేసి జగనన్న కాలనీగా పక్కాగృహాలు మంజూరు చేశారు. మూడేళ్ల క్రితం సుమారు 250 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. అందులో ఇప్పటికి కేవలం 20 మాత్రమే పూర్తయ్యాయి. ఇక్కడ తాగునీటి సమస్య ప్రధానంగా ఉంది. రోడ్డులో పైపులైన్ ఏర్పాటు చేశారు కానీ.. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయలేదు. మురికినీటి కాలువలు లేవు. రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయి. గుట్ట ప్రాంతం కావడంతో రోడ్లలో రాళ్లు ఉన్నాయి. దీంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉంది. ఇక్కడ పాముల బెడద ఎక్కువగా ఉంది.
- మదనపల్లె మండలంలో పోతబోలు వద్ద 3188 మందికి ఇంటి స్థలాలు కేటాయించారు. అందులో ప్రస్తుతానికి కేవలం 200 మంది మాత్రమే అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన వాటిలో చాలా వరకు పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇక్కడ వేసిన ఆరు తాగునీటి బోర్లలో నీళ్లున్నా.. ఇక్కడే ఉన్న ఓటర్‌హెడ్ ట్యాంకుకు అనుసంధానం చేయలేదు. దీంతో ప్రైవేటు ట్యాంకర్లపై ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది.
- రైల్వేకోడూరు మండలం ఉర్లగట్టుపోడు సమీపంలో జగనన్న కాలనీలో అతికొద్ది మంది మాత్రమే ఇళ్లు పూర్తి చేశారు. లబ్ధిదారులకు ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను అప్పట్లో ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే ఆ కాంట్రాక్టరు బిల్లులు తీసుకుని... ఇంటి నిర్మాణాలు పూర్తి చేయలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో.. తెలిసిన వాళ్ల ఇళ్లలో నివాసం ఉంటున్నట్లు లబ్ధిదారులు వాపోయారు.

గుంతల రోడ్లతో అగచాట్లు..



జగనన్న కాలనీలో ఇప్పటికే రెండు వందల మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఇక్కడ రోడ్లు లేవు. మురికి నీటి కాలువలు లేవు. రాత్రిపూట తిరగాలంటే ఇబ్బందిగా ఉంది. నీళ్ల ప్లాస్టిక్ ట్యాంకులు కూడా చాలా దూరంగా పెట్టారు. గుంతల రోడ్డులో నీళ్లు మోసుకోవాలంటే కష్టంగా ఉంది.

- ప్రతాప్, చేనేత కార్మికుడు, పోతబోలు

కాలనీలో ఎటువంటి సౌకర్యాలు లేవు..



జగనన్న కాలనీలో ఎటువంటి సౌకర్యాలు లేవు. సుమారు 6 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు. ఇప్పటికీ ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవు. నివసించడానికి చాలా ఇబ్బందిగా ఉంది. రోడ్లు.. కరెంటు లేక.. నీళ్లు లేక నానా అగచాట్లు పడుతున్నాము. వర్షం వచ్చిందంటే వీధులన్నీ గుంతలమయం. నడిచేందుకు కూడా కుదరదు. మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా ఉపయోగం లేదు. జిల్లా అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి.

- ఆదెన్న, నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ, రాయచోటి

రూ.600 పెట్టి ట్యాంకర్‌తో నీళ్లు కొంటున్నాం..



మా ఇంట్లో నలుగురం ఉన్నాము.. వారానికి ఒక ట్యాంకు నీళ్లు కావాల్సి వస్తోంది. ప్రతి వారం రూ.600 పెట్టి నీళ్లు కొనాల్సి వస్తోంది. టౌన్‌లో కంటే.. ఇక్కడే ఎక్కువ ఖర్చు వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- వెంకటేష్, పోతబోలు, మదనపల్లె

తాగునీటి కుళాయిలు లేక..



తాగునీటి కుళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నాము. తాగునీటి కోసం ప్రధాన రోడ్డులో పైపులైన్ నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాము. మురికినీటి కాలువలు కూడా లేవు. పాముల బెడద ఎక్కువగా ఉంది. కాలనీలో ఉన్న చెట్లను తొలగించాలి.

- సయ్యద్ కుషీదా, లబ్ధిదారురాలు, ములకలచెరువు



జడ్పీ పీఠంపై గురి..?

- చేజారకుండా జగన్ మంత్రాంగం
- 21న జగన్‌తో భేటీకి హాజరు కావాలని జడ్పీటీసీలకు సమాచారం
- వారిని తాడేపల్లెకు తరలించే బాధ్యత ఇన్‌చార్జిలకు అప్పగింత
- వైసీపీ కదలికలపై దృష్టి సారించిన టీడీపీ
- వేడెక్కిన జిల్లా రాజకీయాలు



కడప(రూరల్), ఆగస్టు 19: జిల్లా రాజకీయాలను, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఎన్నడూ పట్టించుకోని జగన్‌కు వారిపై ఉన్నఫలంగా అభిమానం పుట్టుకొచ్చింది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడం అనంతరం ఆ పార్టీకి చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు రాష్ట్రవ్యాప్తంగా వైసీపీని వీడుతుండడంతో.. జగన్‌కు ఒక్కసారిగా వారు గుర్తుకు వచ్చారు. సొంత జిల్లా జడ్పీ పీఠం చేజారకుండా మంత్రాంగం చేస్తున్నారు. ఈనెల 21న తాడేపల్లెలో జగన్‌తో భేటీకి హాజరుకావాలని జడ్పీటీసీలకు అధిష్ఠానం నుంచి సమాచారం వచ్చింది. వారిని తాడేపల్లె ప్యాలెస్‌కు తీసుకొచ్చే బాధ్యతను ముఖ్యనేతలకు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అప్పగించినట్లు తెలిసింది. మరోపక్క వైసీపీ కదలికలపై టీడీపీ దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. జడ్పీ చైర్మన్ పీఠంపై గురిపెట్టినట్లు సమాచారం. సొంత జిల్లాలో జడ్పీని కోల్పోతే పరువు పోతుందని జడ్పీటీసీ సభ్యులతో జగన్ భేటీ అవుతున్నారని అంటున్నారు. దీంతో జిల్లాలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.

వైసీపీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి కడప జిల్లా జగన్‌కు కంచుకోటగా ఉంది. సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుస్తూ జడ్పీ, కార్పొరేషన్, మున్సిపాలిటీల పీఠాలను కైవసం చేసుకుంటూ వస్తున్నారు. అయితే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎవరూ ఊహించని విధంగా ఉమ్మడి కడప జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలకుగాను కేవలం 3 మాత్రమే వైసీపీ గెలుచుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 11 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోకుండా ఘోరంగా ఓటమిపాలైంది. జిల్లాలో ఇప్పటికే వైసీపీ బలం కోల్పోవడంతో ఆ పార్టీని కోలుకోకుండా మరింత దెబ్బతీయాలని టీడీపీ కూటమి పావులు కదుపుతోంది. సొంత జిల్లాలోని జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుని వైసీపీ అధినేత జగన్‌ను దెబ్బకొట్టాలని టీడీపీ ప్రయత్నాలు చేస్తోందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీన్ని గ్రహించిన వైసీపీ ముఖ్యనేతలు జిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను జగన్‌కు వివరించినట్లు తెలిసింది. దీంతో జిల్లా పరిషత్‌తో పాటు, జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీ చేజారకుండా జగన్, ఆ పార్టీ నాయకులు హర్రాహోలు పన్నుతున్నారు. వెరసి ఈనెల 21న తాడేపల్లెకు రావాల్సిందిగా ఆయా జడ్పీటీసీలకు సమాచారం అందించారు. వారితో జగన్ నేరుగా సమావేశం కానున్నారు. పార్టీలో కొనసాగాలని మీ రాజకీయ భవిష్యత్తుకు తాను అన్నివిధాలుగా అండగా ఉంటానని వారికి భరోసా ఇవ్వనున్నారని సమాచారం. ఇప్పటికే కొందరు జడ్పీటీసీ సభ్యులు టీడీపీకి టచ్‌లో ఉన్నారన్న ప్రచారంతో జగన్ వ్యక్తిగతంగా వారితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పలువురు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ కూటమిలో చేరుతున్నారు. విశాఖపట్నం, పుంగనూరు తదితర మున్సిపాలిటీలను టీడీపీ కైవశం చేసుకుంది.

అసంతృప్తిలో జడ్పీటీసీ సభ్యులు

2021 సెప్టెంబర్‌లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలలో అప్పటి వైసీపీ పెద్దలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఉమ్మడి కడప జిల్లాలోని 50 జడ్పీటీసీ స్థానాలలో 38 వాటిని ఏకగ్రీవం చేసుకున్నారు. మిగిలిన 12 స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా గోపవరం జడ్పీటీసీ స్థానాన్ని టీడీపీ, ఇతర 11 స్థానాలు వైసీపీ ఖాతాలోకి వెళ్లాయి. దీంతో 2021 సెప్టెంబర్ 25న జడ్పీ చైర్మన్‌గా ఆకేపాటి అమరనాథరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి జడ్పీటీసీ సభ్యులు ఉత్సవ విగ్రహాల్లాగా మారారు. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు వారి ప్రాంతంలో ఒక్క అభివృద్ధి పనీ చేయలేకపోయారు. పైగా వారిని వైసీపీ పెద్దలెవరూ పట్టించుకోకపోవడంతో అసంతృప్తితో రగులుతున్నారు. ఇలాంటి తరుణంలో వైసీపీ ఘోరంగా ఓడిపోయి టీడీపీ ఘనవిజయం సాధించి అధికారంలోకి రావడంతో.. అసంతృప్త జడ్పీటీసీలు వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు.

జడ్పీ చైర్మన్ పీఠంపై టీడీపీ కూటమి గురి

వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లాలోని జడ్పీ చైర్మన్ పీఠంపై టీడీపీ కూటమి గురిపెట్టినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న ఆకేపాటి అమరనాథరెడ్డి రాజంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన జడ్పీ చైర్మన్ పదవితో పాటు ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా ప్రొద్దుటూరు జడ్పీటీసీ సభ్యురాలు జె. శారద కొనసాగుతున్నారు. జిల్లాలో 50 మంది జడ్పీటీసీ సభ్యులు ఉండగా వైసీపీ 49, టీడీపీ ఒక్క స్థానాన్ని గెలుచుకున్నాయి. ఇటీవల వైసీపీకి చెందిన ఐదుగురు జడ్పీటీసీ సభ్యులు టీడీపీ కూటమిలో చేరారు.

ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి ఆకేపాటి రాజీనామా చేయగా పులివెందుల జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి మృతిచెందారు. ఈ రెండు స్థానాలను పక్కన పెడితే ప్రస్తుతం వైసీపీకి 42, టీడీపీకి ఆరుగురు జడ్పీటీసీలు ఉన్నారు. మరో 16 మంది జడ్పీటీసీ సభ్యులు జంప్ అయితే జడ్పీ పీఠం వైసీపీ నుంచి చేజారిపోతుంది. ఇప్పటికే టీడీపీ కూటమి ఆపరేషన్ ఆకర్ష్‌ని స్టార్ట్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఉలిక్కిపడ్డ వైసీపీ అధిష్ఠానం కడప కంచుకోటను నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- 8 టిప్పర్లు, హిటాచి స్వాధీనం
- 11 మందిపై కేసులు నమోదు

పెనగలూరు, ఆగస్టు 19: మండల పరిధిలోని నారాయణనెల్లూరు వద్ద చెయ్యేటిలో సోమవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను, హిటాచీని స్వాధీనం చేసుకుని 11 మందిని అరెస్ట్ చేసినట్లు పెనగలూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చెయ్యేరులో 8 టిప్పర్లకు ఇసుక నింపుతున్నట్లు ఉన్నతాధికారుల నుంచి పెనగలూరు ఎస్‌ఐకి సమాచారం రావడంతో ఆయన ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌కు సమాచారం ఇచ్చి నారాయణనెల్లూరు వద్ద చెయ్యేటిలోకి ప్రవేశించారు. అక్కడ టిప్పర్లకు ఇసుక నింపుతున్న హిటాచీని, టిప్పర్లను స్వాధీనం చేసుకుని పెనగలూరు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం చెయ్యేటి నుంచి ఇసుక నింపుకుని కోడూరుకు వెళుతున్న రెండు ట్రాక్టర్లను బుట్టిరెడ్డిగారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద పట్టుకుని వాటిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఒక్కో టిప్పర్‌కు, ఒక్కో ట్రాక్టర్‌కు రెండేసి లక్షల రూపాయల వరకు అపరాధ రుసుం విధించవచ్చునని ఆయన తెలిపారు.



ఇసుక తరలిస్తూ పట్టుబడిన టిప్పర్లతో పోలీసు సిబ్బంది

- కొత్తకోటకు వచ్చిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్
- పదేళ్లుగా డబ్బు చెల్లిస్తున్నా రసీదులు ఇవ్వలేదని లీజుదారుల ఫిర్యాదు

మాన్యం భూముల అక్రమాలపై విచారణ

బి.కొత్తకోట, ఆగస్టు 19: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని మాన్యం భూములలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సోమవారం విచారణ జరిపారు. 'ధర్మాదాయంలో అధర్మం' శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీంతో అసిస్టెంట్ కమిషనర్ సోమవారం బి.కొత్తకోటకు చేరుకుని ఫిర్యాదులపై విచారణ చేశారు. చెన్నకేశవ స్వామి మాన్యం భూములైన సర్వే నెంబరు 1840, 1726లో లీజుకు తీసుకున్న వ్యక్తి అక్రమంగా తోడేసిన మూడు ఎకరాల మేర మాన్యం భూమిని పరిశీలించారు. అనంతరం నల్లగంగమ్మ ఆలయ మాన్యం సర్వే నెంబరు 326, 329లలో అధికారికంగా వేలం పాటలు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న వారి వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ఏటా దేవదాయశాఖ సిబ్బందికి రూ.వేలల్లో నగదు చెల్లిస్తున్నామని వాటికి ఎటువంటి రసీదులు ఇవ్వలేదని వారు ఏసీకి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పట్టణ శివారులోని మాన్యం భూములకు 2024-25కు లీజుకు పాడుకుని నగదు చెల్లించినప్పటికీ తాము దున్నుకోవాల్సిన భూపరిమితిని ఇంతవరకు చూపలేదని బాధిత రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఈవో మునిరాజ, సిబ్బందిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బి.కొత్తకోట మాన్యం భూములకు ఇన్‌చార్జ్ ఈవోగా ఉన్న మునిరాజపై గతంలోనూ ఫిర్యాదులు వచ్చాయని ఇప్పుడు నేరుగా చూశానని ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపి తగిన చర్యలకు సిఫార్సు చేస్తామని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.



మాన్యం భూమిలో ఇటుకబట్టీలు నిర్వహిస్తున్న వారితో మాట్లాడుతున్న దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్

వైభవంగా కోదండరాముడి కల్యాణం

ఒంటిమిట్ట, ఆగస్టు 19: కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపం వద్ద నుంచి కల్యాణతంతును ప్రారంభించారు. విష్వక్సేణ పూజ, పుణ్యహవచనం, కంకణధారణ, యజ్ఞోప వితరణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణను వేదపండితులు వైష్ణవ సంప్రదాయంలో సీతమ్మతల్లికి సమర్పించారు. తలంబ్రాలు, పూలచెండ్ల మార్పిడి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరై తిలకించారు. వీరికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ నవీన్, టీటీడీ అర్చకులు పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



23న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాక

- పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి
- మోడల్ పంచాయతీగా మైసూరివారిపల్లె
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రైల్వేకోడూరు, ఆగస్టు 19: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈనెల 23వ తేదీ రైల్వేకోడూరుకు వస్తున్నారని, పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లెలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ మైసూరివారిపల్లెలో నిర్వహించే గ్రామసభకు పవన్‌కళ్యాణ్ హాజరవుతారన్నారు. అధికారులకు కేటాయించిన విధులు ప్రత్యేక శ్రద్ధతో జాగ్రత్తగా నిర్వహించి గ్రామసభను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి సంబంధించిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులు, ప్రాజెక్టుల ఆమోదం కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైసూరివారిపల్లె గ్రామ పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ఇందుకు గ్రామ ప్రజలు సహకరించాలన్నారు. మైసూరివారిపల్లెలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి, డీపీవో ధనలక్ష్మీ, తహసీల్దార్లు, ఏపీ ఎస్పీడీసీఎల్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్

మైసూరివారిపల్లెలో నిర్వహించనున్న గ్రామసభకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వస్తున్న సందర్భంగా సోమవారం హెలిప్యాడ్‌ను రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి పరిశీలించారు. మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త, జనసేన నాయకులతో ఆమె చర్చించారు. ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఆర్‌ఆర్-5 పనులు వేగవంతం చేయాలి

ఓబులవారిపల్లె, ఆగస్టు 19: ఏపీఎండీసీ డేంజర్‌జోన్ గ్రామాల తరలింపునకు సంబంధించిన ఆర్‌ఆర్-5 లేఅవుట్‌ను సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లేఅవుట్‌కు సంబంధించిన మ్యాప్‌ను ఏపీఎండీసీ అధికారులు, రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు అందించారు. అభివృద్ధి పనులకు సంబంధించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ నిదియాదేవి తెలియజేశారు. అలాగే లేఅవుట్‌కు సంబంధించిన మరికొన్ని అవసరాలు, సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కోరగా ఏర్పాటు చేస్తామని సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి పనులకు సహకరించాలని నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి కోరగా అభివృద్ధి పనులకు ప్రభుత్వ నిర్దేశాల మేరకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీర్‌మున్ని, ఆర్‌ఐ రామ్మోహన్, ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డి, ఏపీఎండీసీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, కూటమి పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సమస్యలను కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వివరిస్తున్న మైసూరివారిపల్లె ప్రజలు

శివుడికే.. శఠగోపం?!

- రూ. కోట్ల విలువైన ఆస్తులపై కబ్జాదారుల కన్ను..
- అభిషేకాల టిక్కెట్లలో గోల్‌మాల్
- 50 ఏళ్లుగా వేలానికి నోచుకోని దుకాణాల గదులు
- దేవదాయ శాఖ అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం



మట్లిరాజుల కాలంలో నిర్మించిన భుజంగేశ్వరాలయం

రైల్వేకోడూరు, ఆగస్టు 19: వైసీపీ ఐదేళ్ల పాలనలో శివుడినీ వదలేదు. హుండీలోని కానుకలు, అభిషేకం టికెట్ల నుంచీ, భూముల కబ్జాలు, ఆస్తుల వేలం వరకూ అన్ని అంశాల్లో అవినీతి వేళ్లూనుకుంది. ఆలయ ఆస్తులను అభివృద్ధి చేయడంతోపాటు రక్షణ కల్పించాల్సిన అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తుండడంతో దాతలే అభివృద్ధి పనులకు పూనుకుంటు న్నారు.

రైల్వే కోడూరు పట్టణ నడిబొడ్డున ఉన్న భుజంగేశ్వరస్వామి ఆలయానికి 125 ఏళ్ల చరిత్ర ఉంది. మట్లి రాజుల కాలంలో 50 సెంట్ల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి రోజున మట్లి రాజులు బోనాలు తీసుకుని వచ్చి స్వామికి సమర్పించి పూజలు చేసే వారని తెలుస్తోంది. కార్తీక మాసం, మహా శివరాత్రి, పౌర్ణమిలతో పాటు ప్రతిరోజూ స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారు. కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఆలయానికి ఉత్తర వైపు ఉన్న ప్రహరీ శిథిలావస్థకు చేరుకుంది. దాతలే శివాలయాన్ని అభివృద్ధి చేస్తున్నారే తప్ప దేవదాయ శాఖ చేసిందేమీ లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

తూతూ మంత్రంగా విచారణ

ఐదేళ్ల వైసీపీ పాలనలో అభిషేకాల టిక్కెట్లలో గోల్‌మాల్, అర్చకుల వేతనాలు పెంపు పేరుతో ఓ వైసీపీ నేత రూ.20 వేలు లంచం తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో గత నెలలో దేవదాయ శాఖ జిల్లా అధికారులు విచారణ చేసినా అది తూతూ మంత్రంగా జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆలయానికి ఏడాదికి రూ.10 లక్షలు ఆదాయం ఉంటుందని అంచనా.. అయితే, రికార్డులు తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఈ విషయంపై కూడా విచారణ చేశారు. ఆలయానికి సర్వే నెంబరు 719/1 లో రూ.10 కోట్లు విలువ చేసే 1.7 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిపై గతంలో కొందరు కన్నేశారు. పాత రికార్డులు చూపి సొంతం చేసుకోవాలని చూశారు. అయితే, స్థానికులు అడ్డుపడడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ఈ భూమిని దేవదాయ శాఖ అధికారులు వేలం వేసి కౌలుకు ఇచ్చేవారు. కొంతకాలంగా కౌలు వేలం నిర్వహించకపోవడంతో అది నిరుపయోగంగా మిగిలింది. ప్రధాన దారిలోని రూ. 3 కోట్ల విలువ చేసే 4 సెంట్ల స్థలం కబ్జాకు గురైంది. పాతబజారు వీధిలో రూ. 80 లక్షలు విలువ చేసే ఇంటి స్థలం ఉంది. ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ స్థలం కూడా నిరుపయోగంగా మారింది. కాగా, కబ్జాల్లో ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మాజీ చైర్మన్ ఉంగరాల నాగేంద్రరావు కోర్టుకు వెళ్లారు. అయినా అధికారులు పట్టించుకోలేదు.

ఆలయ ఆదాయానికి గండి

ఇక ఆలయం ముందు భాగంలో ఉన్న 16 దుకాణాలకు 50 ఏళ్లుగా వేలం నిర్వహించడం లేదు. ఈ గదులకు సంబంధించి రికార్డుల్లో ఒకరి పేరు నమోదై ఉండగా, వాటిలో మరొకరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే హుండీలోని కానుకల. లెక్కింపులో కూడా గోల్‌మాల్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల అధికారులు ఆలయాన్ని సందర్శించినప్పుడు ఆలయానికి సంబంధించిన గదులను వేలం వేయించాలని, ఆలయ రికార్డులు బహిరంగ పరచాలని, కబ్జాల్లో ఉన్న స్థలాలను స్వాధీనం చేసుకోవాలని, 1.7 ఎకరాల స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మించాలని భక్తులు డిమాండ్ చేశారు.



నిరుపయోగంగా ఉన్న ఆలయ భూమి



ఆలయం ముందు భాగంలో ఉన్న దుకాణాల గదులు

ఆలయ రికార్డులు పరిశీలించాం

అభిషేకాల టిక్కెట్ల వ్యవహారం తదితర విషయాలపై విచారణ చేశా. ఆలయ రికార్డులు పరిశీలించాం. కబ్జాల్లో ఉన్న స్థలాలను సర్వే చేసి అప్పగించాలని రెవెన్యూ శాఖ అధికారులను కోరాం. గదుల వేలం నిర్వహిస్తాం. ఆలయ వ్యవహారాల్లో ఎలాంటి గోల్‌మాల్ వ్యవహారాలు జరగలేదు. రికార్డులు సక్రమంగా ఉన్నాయి.

\- విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయ శాఖ

ప్రజా సమస్యలపై శ్రద్ధ చూపాలి : కలెక్టర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో.

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 12: ప్రజా సమస్యలపై శ్రద్ధతో అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి అర్జీని వెంటనే పరిష్కరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలపై పూర్తి అవగాహన చేసుకుని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శరాజేంద్రన్, డీఆర్ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 19: మదనపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశం కోరు విద్యార్థులనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 16 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుందని అందులో పేర్కొన్నారు. .మరిన్ని వివరాలకు జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ సెల్ నెంబర్:8247702733 ని సంప్రదించాలని తెలిపారు.

ఫొటోగ్రఫీ శాఖను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం



ఫొటోలను పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసరు విశ్వనాథకుమార్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 19 : యూనివర్సిటీలోని ఫొటోగ్రఫీ శాఖను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని వైస్ చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ అన్నారు. సోమవారం కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీలో ఫొటోగ్రఫీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తీసిన చిత్రాల నుంచి అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చారిత్రక వాస్తవాలను, అనుభూతులను అందించే ఫొటోగ్రఫీ మానవాళికి ఒక వరమన్నారు. ఫొటోగ్రఫీ మన జీవితంలో విడదీయరాని భాగమన్నారు. సెల్ఫీల నుంచి యుద్ధాలు, మానవ హక్కుల ఉల్లంఘనలను డాక్యుమెంటు చేయడం వరకూ వివిధ మార్గాల్లో ఈ మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారన్నారు. రిజిస్ట్రారు రాజేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది కళ, క్రాఫ్ట్, సైన్స్, చరిత్ర అన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో లావాదేవీలు నిర్వహిస్తే చర్యలు

ఎర్రగుంట్ల, ఆగస్టు 19: అక్రమ లేఅవుట్లలో లావాదేవీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు ఎర్రగుంట్ల నగర పంచాయతీలో వేసిన పలు లే అవుట్లను ఎర్రగుంట్ల నగర పంచాయతీ అధికారులు 'అక్రమమైనవిగా గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు . పంచాయతీ పరిధిలోని 720పి, 719పి, 711, 712, 714, 734పి, 732పి, 649పి, 631/1, 631/2, 630పి, 622పి, 623, 151-3, 292-3, 318/1ఏ, 319/1, 126పి, 127పి, 299/1, 300/2, 301/1ఏ, 302, 149/1, 63/ఏ, 64/ఏ, 56, 68ఏ, 69ఏ(పి), 297-ఏ, 344/1ఏ, 337(పి), 164, 189పి, 338-(1,2,3,4), 634, 735(పి), 736(పి) సర్వే నెంబర్లలో వేసిన లేఅవుట్స్‌ను అక్రమ లే అవుట్స్‌గా గుర్తించి వీటిలో ఇకపై ఎలాంటి లావాదేవీలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. పైన తెలిపిన సర్వేనెంబర్లలో ప్లాట్లు, స్థలము కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యం కాదన్నారు.భవనిర్మాణ అనుమతులు మంజూరు చేయరన్నారు.

వామికొండ, సర్వరాయసాగర్‌కు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, భూపేష్‌రెడ్డి,

ముద్దనూరు, ఆగస్టు 19: మండలపరిధి శెట్టివారిపల్లె సమీపం లోని గాలేరు-నగరి కాలువ హెడ్ రెగ్యులేటర్ నుంచి వామికొండ, సర్వరాయసాగర్ జలాశయాలకు సోమవారం కృష్ణా జలాలు విడుదల చేశారు. జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డిలు హెడ్ రెగ్యులేటర్ వద్ద స్విచ్‌ఆన్ చేసి గండికోట ప్రాజెక్టు నుంచి 500 క్యూసెక్కుల నీటిని కాలువ ద్వారా విడుదల చేశారు. జంబాపురం రమణారెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సుండుపల్లె, ఆగస్టు 19: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి అపహరించుకు వెళ్లినట్లు రాయచోటి రూరల్ సీఐ తులసీరాం తెలిపారు. మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు వెనుక నివసించే నాగేంద్ర శుక్రవారం రాత్రి ఇంటి తలుపులకు తాళం వేసి గ్యారంపల్లికి వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండడం కనిపించింది. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సాయంతో సాక్ష్యాధారాలు సేకరించడంతోపాటు, సమీపంలో ఉన్న సీసీ కెమెరాను పరిశీలించామన్నారు. ఈ 25 గ్రాములు బంగారం, వెండి దీపాలు అపహణకు గురైనట్లు కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చిన్నమండెం సీఐ సుధాకర్, సుండుపల్లె పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రమేశ్‌నాయక్ మృతదేహం

కడప (క్రైం), ఆగస్టు 19 : అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతి చెందినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. రామకృష్ణనగర్‌కు చెందిన రమేశ్‌నాయక్ (35) బేల్దారి పని చేస్తుంటాడు. ఇతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఆదివారం రాత్రి రాజంపేట రింగురోడ్డు సర్కిల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో అతని మృతదేహం లభ్యమైంది. ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో, మద్యం మత్తులో అక్కడికి వచ్చి మృతి చెందాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే విషయం పూర్తి స్థాయిలో విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహిళ మరణానంతర నేత్ర దానం



లావణ్య(ఫైల్)

ప్రొద్దుటూరు, ఆగస్టు 19 : పట్టణం లోని రామేశ్వరం ప్రాంతానికి చెంది న స్నేహ సేవా సమితి అధ్యక్షుడు మధు భార్య లావణ్య సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మరణించారు. దీంతో ఆయన తన భార్య కళ్ళను దానం చేయడానికి పూనుకున్నారు. పులివెందులకు చెందిన టెక్నీషియన్ హరీష్ రాజు లావణ్య కార్నియాను సేకరించి హైదరా బాదుకు చెందిన డాక్టర్‌అగర్వాల్ హాస్పిటల్‌కు పంపారు. జేవీవీ అధ్యక్షుడు అరవేటి చం ద్రశేఖర్, సృజన శ్రీను, పల్లవోలు రమణ, శ్రీరాములు, హరేరాం, రాంబాబు, శేఖర్ మధు కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు, ఆగస్టు 19 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు. పాపాఘ్నినది వద్ద ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా, ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు పట్టుబడ్డాయన్నారు. వాటిని తహసీల్దారు కార్యాలయంలో అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

పెద్దవడుగూరు, ఆగస్టు 19: అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం వీరేపల్లి గ్రామసమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ పెంచలయ్య (38) అక్కడికక్కడే మృతిచెందాడు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం సరస్వతిపల్లె గ్రామానికి చెందిన పెంచలయ్య గ్యాస్ సిలిండర్ల లోడుతో తాడిపత్రి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. బ్రేక్‌డౌన్ కారణంగా రోడ్డుపై నిలిచిపోయిన లారీని వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన పెంచలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రెడ్డెప్ప తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

ములకలచెరువు, ఆగస్టు 19: పొట్లాడుతున్న పొట్టేళ్లను అడ్డుకు నేందుకు యత్నించిన మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన సోమవారం జరిగింది. ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ ఎర్రగుడివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి భార్య సిద్ధమ్మ(55) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం గొర్రెల మందలోని రెండు పొట్టేళ్లు తీవ్రంగా పొట్లాకుంటుండగా గమనించిన సిద్ధమ్మ అడ్డుతగిలింది. దీంతో రెండు పొట్టేళ్లు ఆమె మీద దాడి చేయడంతో చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్సల నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పులివెందులను సస్యశ్యామలం చేస్తాం

● మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ● గండికోట నుంచి సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్ కు నీరు విడుదల

కొండాపురం, ఆగస్టు 19: గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నీటితో నింపి పులివెందులను సస్యశ్యామలం చేస్తామని మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) తెలిపారు. కొండాపురం వద్ద ఉన్న రెండు పంప్‌హౌస్‌లలో సోమవారం పూజ కార్యక్రమాలు నిర్వహించి మోటర్లు ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల చరిత్రలో ఆగస్టు మొదటి వారంలోనే శ్రీశైలం జలాశయం నిండటం ఇదే తొలిసారి అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో కరువు వస్తుందని వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే మాటలు మానుకోవాలని ఆయన సూచించారు. గండికోట జలాలతో సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపి సాగునీటి కొరత లేకుండా చూస్తామన్నారు. మైక్రో ఇరిగేషన్ ద్వారా పులివెందుల నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు నీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. సీబీఆర్‌కు రెండు మోటర్ల ద్వారా 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు ఐదు మోటర్ల ద్వారా 500 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల ప్రాణాలు తీయడం అమానుషం: తులసి రెడ్డి



వేంపల్లెలో నిరసన వ్యక్తం చేస్తున్న తులసిరెడ్డి, వైద్యులు తదితరులు

వేంపల్లె, ఆగస్టు 18: ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లు, ఆరోగ్య సిబ్బందిపై దాడులు, హత్యాచారాలు అమానుషం అని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, మహిళలపై దాడులకు నిరసనగా డాక్టర్ ఎస్ఎఫ్ బాషా ఆధ్వర్యంలో సోమవారం వేంపల్లెలో భారీ ర్యాలీ నిర్వహించారు. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు మానవత్వం నశించిపోతుండగా రాక్షసత్వం, క్రూరత్వం పెరిగిపోతున్నాయన్నారు. వ కలకత్తాలో ఆర్జీ కర్ ఆసుపత్రిలో పీజీ విద్యార్థినిపై హత్యాచారం మానవ జాతికి, మగజాతికి మాయనిమచ్చ అని తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రియ, చక్రపాణిరెడ్డి, రమణారెడ్డి, విజయ భారతి, ఓబుళరెడ్డి, సుష్మ, సుబ్రమణ్యం, అమర్, ఉత్తన్న, వేమా రాజా, బాలం సుబ్బరాయుడు, రాజు, మాస్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నా భర్త ఆచూకీ తెలపండి

● ఎస్పీకి మహిళ వినతి

కడప (క్రైం), ఆగస్టు 19 : తన భర్త కనిపించక రెండేళ్లవుతున్నా.. పోలీసులు పట్టించుకోవడంలేదని పి.వెంకటసుబ్బమ్మ, ఆమె కుమారుడు భాస్కరాచారి సోమవారం ప్రజా పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వైఎస్ఆర్‌జిల్లా చక్రాయపేట మండలం అద్దాలమర్రి కొండపైన సారా కాస్తుండడంపై పోలీసులకు సమాచారం అందిస్తున్నాడని గ్రామస్థులు తన భర్త ఈశ్వరాచారిపై ఆగ్రహంగా ఉండేవారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఉద్దేశంతో గ్రామానికి చెందిన బి.మల్లికార్జునరెడ్డి, సుధాకర్‌రెడ్డితో పాటు కె.నాగేశ్వర్‌రెడ్డి, సిద్దారెడ్డి, చంద్ర ఓబులరెడ్డి, చంద్రశేఖరరెడ్డితో పాటు మరికొంత మంది కలిసి 2022 సెప్టెంబరు 1న దాడి చేసి గ్రామానికి దగ్గరలోని కొండ పైకి తరుముకుంటూ వెళ్లారని, ఆ. తరువాత తన భర్త ఆచూకీ తెలియరాలేదన్నారు. ఆ సమయంలో చక్రాయపేట ఎస్ఐగా ఉన్న మల్లికార్జునరెడ్డి కేవలం అదృశ్యం కేసుగా నమోదు చేసి తరువాత పట్టించుకోలేదన్నారు. తన భర్తను చంపేసి ఎక్కడో పడేశారని ఊరంతా అనుకుంటున్నారని తెలిపారు. తన భర్త ఆచూకీ తెలియజేయాలని, లేదంటేబాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన సయ్యద్ ఇమ్రాన్

సికెదిన్నె, ఆగస్టు 19: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు సికె దిన్నె పోలీసులు తెలిపారు. బోడెద్దుల పల్లెకు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (35) రాయచోటిరోడ్డులోని పవర్‌గ్రిడ్ వద్ద వెల్డింగ్ షాపు పెట్టుకుని జీవనం సాగించేవాడు. సోమవారం బుగ్గలపల్లె పంచాయతీ గూడవాండ్లపల్లె గ్రామంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై మృతిచెందాడు., అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి ..

సికెదిన్నె, ఆగస్టు 19: రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందినట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఆవుల సందీప్ (20) , అతని స్నేహితుడు సంతోష్‌తో కలిసి బైకులో ఇంటికి వస్తుండగా ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సందీప్ మరణించాడు. సంతోష్ కోలుకుంటున్నాడని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప విజయదుర్గాకాలనీలో చోరీ

●కేజీ వెండి, మూడు తులాల బంగారు, 30వేలు నగదు అపహరణ

కడప (క్రైం), ఆగస్టు 19 : రిటైర్డు ఉద్యోగి ఇంట్లో దొంగలు పడి కేజీ వెండి, మూడు తులాల బంగారం, రూ.30 వేలు నగదు అపహరించుకు వెళ్లారు. తాలూకా పోలీసుల కథనం మేరకు కడప నగరం లోని విజయదుర్గా కాలనీలో నివసించే రిటైర్డు ఉద్యోగి జయరాములు కుటుంబ సభ్యులు వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాదుకు వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళాలు పగిలిపోయి కనిపించాయి. కేజీ వెండి వస్తువులు, మూడు తులాల బంగారు నగలు, రూ. 30 వేలు నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వివరించారు.

స్థలం విషయమై ఘర్షణ

ముద్దనూరు, ఆగస్టు 19: స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని ఓ వివాదాస్పద స్థలం వద్ద సోమవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేనమామ కుడుముల మునిరాజారెడ్డి ఎన్డీయే నాయకుడు అల్లీషేర్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు సంఘటనా స్థలం వద్ద సీఐ దస్తగిరి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేయలేదని పోలీసు లు తెలిపారు.

కారుకు నిప్పు



దుండగులు నిప్పంటించిన కారు

వేంపల్లె, ఆగస్టు 19: వేంపల్లె చైతన్య స్కూల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు కారుకు నిప్పుపెట్టారు. వీరపునాయునిపల్లె మండలం ఎరమలపల్లెకు చెందిన కరుణాకర్ రెడ్డి తన ఇంటికి సమీపంలో కారును నిలిపి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో వెనుకవైపు కాలిపోయింది. దీనిపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి రిమాండ్

ముద్దనూరు, ఆగస్టు 19: ఉపాధి నిధుల దుర్వినియోగం చేసిన కేసులో ఉప్పలూరు గ్రామ కార్యదర్శి రాయపాటి రెహమాన్‌ను సోమవారం రిమాండ్‌కు పంపినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఈఏడాది ఫిబ్రవరి 29న గ్రామీణ ఉపాధి నిధులు రూ.6.70లక్షలు సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు కేసు నమోదు కాగా, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● 60 శాతం వీధికుక్కలకు స్టెరిలైజేషన్ ● త్వరలో పునరావాస కేంద్రాల ఏర్పాటు ● ఎంహెచ్‌వో చంద్రశేఖర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 19 : కడప కార్పొరేషన్ పరిధిలోని పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసరు ఎన్.చంద్రశేఖర్ సూచించారు. కడప నగరంలో 60 శాతం కుక్కలకు స్టెరిలైజేషన్ చేశామన్నారు. త్వరలో కుక్కల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎంహెచ్‌వో ఛాంబరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 8,340 కుక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిలో 60 శాతం వరకు స్టెరిలైజేషన్ చేయడం జరిగిందన్నారు. మిగతా వాటికి కూడా త్వరలో స్టెరిలైజేషన్ చేస్తామని తెలిపారు. ఎన్‌జీవో సంస్థ ద్వారా కొన్ని కుక్కలను కేర్ సెంటర్లకు తరలించామన్నారు. ప్రధానంగా రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పాఠశాలలు, మందిరాలు తదిరర ప్రదేశాల్లో కుక్కలకు ఫీడింగ్ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పెంపుడు కుక్కలకు మాత్రం రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని సూచించారు.

బుగ్గవంకలో చికెన్ వ్యర్థాలు వేస్తే చర్యలు

కడప నగరంలోని బుగ్గవంకలో చికెన్ వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌వో హెచ్చరించారు. బీడీ రాజా అనే సంస్థకు చికెన్ వ్యర్థాల సేకరణ కాంట్రాక్టు అప్పగించామన్నారు. ఇందుకు సంబంధించిన వాహనాల్లో మాత్రమే చికెన్ వ్యర్థాలు వేయాలన్నారు. అలాకాకుండా బుగ్గవంక బ్రిడ్జి ప్రాంతాల్లో వేస్తే భారీ జరిమానా తప్పదన్నారు. త్వరలో బుగ్గవంక బ్రిడ్జి సమీపంలో సీసీ కెమెరాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు. చికెన్ వ్యాపారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

చట్టాలు అతిక్రమిస్తే చర్యలు


సీఐగా బాధ్యతలు చేపడుతున్న చంద్రశేఖర్

రాయచోటిటౌన్,ఆగస్టు 19: ప్రభుత్వ నిబంధనలను, చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి అర్బన్ సీఐ పి.చంద్రశేఖర్ హెచ్చరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఈయన అనంతపురం జిల్లా వీఆర్ నుంచి రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఎస్‌ఐలతో పాటు పోలీసు సిబ్బంది నూతన సీఐను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే ప్రజలకు సిబ్బంది జవాబుదారీతనంగా పని చేయాలని సూచించారు. చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రజలకు తెలియజేశారు.

ఒంటిమిట్ట సీఐగా కృష్ణంరాజునాయక్



ఒంటిమిట్ట, ఆగస్టు 19: ఒంటిమిట్ట, సిద్దవటం పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణంరాజునాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కోదండరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని, ఫ్రెండ్లీ పోలీసుల ద్వారా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం సిద్దవటం ఒంటిమిట్ట ఎస్‌ఐలు శివప్రసాద్, చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


ప్రత్యేక అలంకరణలో కోదండరామయ్య

రైల్వేకోడూరు, ఆగస్టు 19: పట్టణంలోని పగడాలపల్లెలో సోమవారం నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతా, రామ, లక్ష్మణ దేవతా మూర్తులకు ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. వేలాది మంది భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల సమస్యలను వింటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 50 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు వచ్చే ఫిర్యాదుదారులు వారి సమస్యలను విని అర్జీలను పరిశీలించి చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియపరిచి చట్టప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.


విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల మార్చ్ ఫాస్ట్‌లో ప్రతిభ చూపిన జిల్లా స్కౌట్ విద్యార్థులకు సోమవారం కలెక్టర్ శ్రీధర్ అభినందనలు తెలుపుతున్న దృశ్యం

సబ్‌కలెక్టర్‌కు టీడీపీ నాయకుల వినతి

రాజంపేట, ఆగస్టు 19: రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రాజంపేట టీడీపీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు బృందం, డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధీర్‌లు రాజంపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న జగనన్న కాలనీల్లో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవికి వినతిపత్రం అందజేశారు. అనర్హులకు ఇచ్చి, నిరుపయోగంగా ఉన్న ఇంటి పట్టాలను రద్దు చేసి అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేకా నరసింహులు, మైనార్టీ నాయకుడు అబూబకర్, కొల్లా వెంకటసుబ్బయ్య, శంకర్‌రాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం జరగాలి : విద్యార్థి సంఘాలు

సంబేపల్లె, ఆగస్టు 19: కోల్‌కత్తాలో జరిగిన రేప్ సంఘటనను నిరసిస్తూ డాక్టర్ మౌమితకు న్యాయం జరగాలని విద్యార్థి సంఘ నాయకులు కునాని హరిప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సంబేపల్లె జడ్పీహెచ్ఎస్ స్కూల్, మోడల్ స్కూల్ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు సంఘీభావం ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ చైర్మన్ రెడ్డిమోహన్, విద్యార్థి సంఘాల నాయకులు కొప్పుల బాలాజీ, పోలు గణేశ్, బొల్లం వెంకటేశ్, గౌరీ గణేశ్, కొప్పుల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ల కారు బోల్తా

● ఇరువురు పరార్

సుండుపల్లె, ఆగస్టు 19: సుండుపల్లె మీదుగా అడవిలోకి ప్రవేశించేందుకు ఎర్రచందనం స్మగ్లర్లు ఓ వాహనంలో పీలేరు నుంచి సుండుపల్లె రహదారిలో వస్తుండగా విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు వెంబడించారు. ఇది గమనించిన స్మగ్లర్లు సుండుపల్లె మీదుగా సానిపాయి నుంచి పరారవుతుండగా రాయచోటి సమీపంలోని గంగోత్రి ఫ్యాక్టరీ వద్ద స్మగ్లర్ల కారు బోల్తా పడింది. మద్యం మత్తులో ఉన్న స్మగ్లర్లు కారు అద్దాలు పగులగొట్టి పరారైనట్లు సానిపాయి రేంజ్ ఫారెస్టు అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, రాయచోటి రూరల్ సీఐ తులసిరామ్‌లు తెలిపారు. ఈ కారులో ఎర్రచందనం చెట్లు నరికేందుకు ఉపయోగించే రంపము, టార్చ్‌లైట్లు, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు నెంబరు ప్లేటు ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆచూకీ లభ్యం

రామాపురం, ఆగస్టు 19: మండల కేంద్రమైన పాత రామాపురానికి చెందిన కొరివి జయశ్రీ (20) ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె భర్త గంగాధర కనిపించలేదని ఈ నెల 15న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆమె ఫోన్ కాల్‌డేటా ఆధారంగా సుండుపల్లె మండలం సానిపాయలో ఉన్నట్లు గుర్తించడంతో వెంటనే ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆమె భర్తకు పోలీస్‌స్టేషన్‌కు రమ్మని సమాచారం ఇచ్చి జయశ్రీని అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్‌శర్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మండలాన్ని అభివృద్ధి చేస్తాం'

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 19: రాబోయే ఐదేళ్లలో లక్కిరెడ్డిపల్లె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మండిపల్లి ట్రస్ట్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రవీంద్రనగర్‌లో ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సమస్యలపై ఆరా తీస్తున్నామని, ముందుగా తాగునీరు సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ విషయాన్ని అధికారులు తొందరగా నివేదికలు అందిస్తే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా మండలంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. అంతేగాకుండా వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ నుంచి చెరువులకు సాగునీరు అందించి మండలాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల యువ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మదన్‌మోహన్, రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణయ్య, ఆదిమూలం వేమయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్, ఆంజనేయులు, ఆరీఫుల్లా, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

నందలూరు, ఆగస్టు 19: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడామైదానం సమీపంలోని తమ స్థలాలను జంబు రవీంద్రబాబు విశ్రాంత ఉద్యోగి ఆక్రమించాడని, తమకు న్యాయం చేయాలని స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్, కుంచెపు లక్ష్మీనరసమ్మ, తహశిల్దారు అమర్‌నాథ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్యామ్‌రాజ్ మాట్లాడుతూ తనకు చెందిన 3 సెంట్ల స్థలంలో ఒకటిన్నర సెంటు స్థలంలో బేస్‌మట్టం వేయడం జరిగిందని, మిగిలిన ఒకటిన్నర సెంటును, అదేవిధంగా లక్ష్మీనరసమ్మ తనకు చెందిన మూడు సెంట్ల స్థలంలో రెండు సెంట్లు స్థలంలో ఇంటిని నిర్మించుకోగా మిగిలిన ఒక సెంటు స్థలాన్ని మొత్తం తమ ఇద్దరికి చెందిన రెండున్నర సెంట్ల స్థలాన్ని జంబు రవీంద్రబాబు ఆక్రమించాడని ఆరోపించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

సుండుపల్లె, ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడటంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి సర్వసభ్య సమావేశానికి ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడం హాస్యాస్పదంగా ఉందని పలువురు విమర్శించారు. ప్రజాప్రతినిధులు సమస్యలను సర్వసభ్య సమావేశంలో చెబితేనే కదా... ప్రభుత్వం దృష్టికి సమస్యలు వెళ్లేది.. ప్రభుత్వం పరిష్కరించేది అని కూటమి నేతలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పోటీ చేయకుండా ఎన్నికలు జరగకుండా దాదాపు 90 శాతం ప్రజాప్రతినిధులు ఎన్నికలు జరగకుండానే ఏకగ్రీవంగా అధికార దుర్వినియోగంతో అధికారంలోకి వచ్చిన వారే అలాంటి వారు ప్రజా సమస్యలపై ఏం శ్రద్ధ చూపుతారని విమర్శలు వస్తున్నాయి. కోరం లేకపోవడం వలన సమావేశాన్ని నిర్వహించలేకపోతున్నామని ఎంపీడీవో రామచంద్ర సమావేశంలో ప్రసంగించారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అధికారులను, పాత్రికేయులను కోరారు. మండల వ్యాప్తంగా అనేక సమస్యలు కొలువుదీరి ఉన్నాయి. ఈ సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే వెంటనే పరిష్కార మార్గం దొరుకుతుందని పలువురు ఆశిస్తున్నారు. జెడ్పీటీసీ ఇస్మాయిల్, ఎంపీపీ రాజమ్మ వ్యక్తిగత కారణాల కారణంగా ఈ సమావేశానికి హాజరు కాలేదని తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, ఏపీవో మాలిక్‌బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ప్రసాద్, విద్యుత్‌శాఖ అధికారి రమేశ్‌బాబు, వైద్యాధికారి హసన్ అలీ, రాయవరం సర్పంచ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజయ్యా.. నీ భక్తులకు దారి ఎక్కడయ్యా..?


కోనకు వెళ్లే మార్గంలో ఇబ్బందులు పడుతున్న భక్తులు

సిద్దవటం, ఆగస్టు 19: నిత్యపూజయ్యస్వామి.. నీ కోనకు చేరుకోవడానికి దారి ఎక్కడయ్యా..! అంటూ భక్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలినడకన నరకయాతన పడుతూ స్వామి దర్శనానికి అడుగడుగునా ఇబ్బందులు పడుతూ కొండకు చేరుకుంటున్నారు. సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ పంచాయతీ లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర కోనకు సోమవారం కడప జిల్లాల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు శివపార్వతుల దర్శనం కోసం పంచలింగాల వరకు వాహనాల్లో వస్తారు. అక్కడ వాహనాలను పార్కింగ్ చేసి కాలినడకన అటవీ ప్రాంతం గుండా వెళుతూ ఉంటారు. అయితే మార్గమధ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎండిన మొక్కలు, తీగలు భక్తులకు ఆటంకంగా ఉండడంతో అసహనం కోల్పోతున్నారు. సంబంధిత దేవాదాయశాఖ అధికారులు భక్తుల మనోభావాలను అర్థం చేసుకుని కాలినడకన వెళ్లే రహదారికి అడ్డంగా ఉన్న వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ సిబ్బంది చంద్రను వివరణ కోరగా ఈ విషయాన్ని ఈవో దృష్టికి తీసుకుని రహదారిని శుభ్రం చేస్తామని తెలియజేశారు.

పంచాయతీ అభివృద్ధి పనులపై సమావేశం

పెనగలూరు, ఆగస్టు 19: మండలంలోని సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతి కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ గానుగపెంట ఎల్లమ్మ అధ్యక్షతన పంచాయతి అభివృద్ధి పనులపై వార్డుమెంబర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గడ్డమీద హరిజనవాడ, సింగారెడ్డిపల్లె ,హరిజనవాడ, కంబాలకుంట బీసీ కాలని గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతి పరిధిలో నిర్వహించాల్సిన అభివృద్ధి కార్యక్రమాల సమస్యల పరిష్కారం ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపైన సుదీర్ఘంగా చర్చించారు. ఇదిలా ఉండగా గతంలో ఎన్నడూ లేనివిధంగా సింగారెడ్డిపల్లె గ్రామ పెద్దలు కూడా పాల్గొని అన్ని గ్రామాల పెద్దలను, యూత్ సభ్యులను గ్రామ సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన యువకులతో రెండు గంటల వరకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ లింగం చంద్రమ్మ, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు లక్ష్మీనరసయ్య, శివయ్య, జంగయ్య, వెంకటయ్య, నరేష్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

రాజంపేటటౌన్, ఆగస్టు 19: పట్టణంలోని వైబీఎన్‌పల్లెలో ఉన్న వినాయక అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రావణపౌర్ణమి, రాఖీపౌర్ణమి హగ్రీవ జయంతి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అప్పలాచారి అభిషేకం, వడమాల పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సాగిన గిరిప్రదక్షిణ


గిరిప్రదక్షిణ చేపడుతున్న రామ భక్తులు

ఒంటిమిట్ట, ఆగస్టు 19: ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదర్శనను రామభక్తులు నిర్వహించారు. కోదండ రామాలయం నుంచి 14 కి.మీ. తెల్లవారుజామున ప్రారంభమైన గిరి ప్రదర్శన కొత్తపల్లె, ఇబ్రహీంపేట, రాచగుడిపల్లె, రాచపల్లె, సాలాబాదు, మలకాటిపల్లె మీదుగా రామాలయం వద్దకు చేరుకున్నారు. భక్తులు శ్రీరామ.. జయరామా అంటూ రామనామస్మరణ చేస్తూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాటూరి గంగిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బాలరాజు, శివరాజు, రోశయ్య, కొండారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర


పాదయాత్రగా బయలుదేరిన కసిరెడ్డి, టీడీపీ నాయకులు

గాలివీడు, ఆగస్టు 19: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో పాటు రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఎన్నికల ముందు కలియుగ దైవం వెంకటేశ్వర స్వామికి మొక్కుకున్నట్లు టీడీపీ నాయకుడు కసిరెడ్డి వెంకటశివారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పెద్దూరు బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంఘీభావం తెలిపారు. ఈ పాదయాత్రలో తన వెన్నంటే ఉంటూ తన మీద అభిమానం చూపిన ప్రతిఒక్క టీడీపీ కార్యకర్తకు, అభిమానులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కసిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో ఘనంగా పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, ఆగస్టు 19: పట్టణంలో వెలిసియున్న భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్ఛారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో మంగళ వాయిద్యాలు, కోలాటాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

రాజంపేట, ఆగస్టు 19: భువనగిరిపల్లె లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రాజగోపురం నిర్మాణానికి భువనగిరిపల్లెకు చెందిన ఆకుల సుబ్బనరసింహులు, ధర్మపత్ని శ్రీదేవిలు రూ.1,01,116ను అందజేశారు. ఆలయ ధర్మకర్త పూల హరిప్రసాద్, కంబాయగారి నరసింహులు, కావేరిగారి వెంకటరమణల చేతికి సోమవారం విరాళం ఇచ్చారు. ఆలయ గోపురానికి సహకరించిన దాతలకు ఆలయ ధర్మకర్త కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి ఘన సన్మానం


వీసీ గోపాల్‌ను సత్కరించిన ఉద్యాన అధ్యాపక బృందం, సిబ్బంది

రైల్వేకోడూరు, ఆగస్టు 19: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్శిటీ వీసీగా నియమితులైన డాక్టర్ కే.గోపాల్‌ని సోమవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఉద్యాన యూనివర్శిటీలో వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గోపాల్ తొలిసారిగా సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అనంతరాజుపేట ఉద్యాన కళాశాల తనకు ఎన్నో అనుభవాలను నేర్పిందని, తాను ఇక్కడ అసోసియేట్ డీన్‌గా పనిచేశామని తెలిపారు. అందరి సహకారంతో ఉద్యాన కళాశాల అభివృద్ధికి పాటుపడినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్, ఓఎస్‌ఏ డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, జోనల్ రీసెర్చ్ హెడ్ డాక్టర్ కేటీ వెంకటరమణ, వీసీ సతీమణి లీలావతి, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రత్నం, అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత సేవలు అవసరం


మూడురోడ్ల కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న మానవత సభ్యులు, విద్యార్థులు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 19: మానవత సేవలు నిరుపేదలకు ఎంతో అవసరమని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎస్‌ఐ రవీంద్రబాబులు పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక నలంద విద్యానికేతన్ హైస్కూల్, విశ్వభారతి హైస్కూల్ విద్యార్థులచే నలందనగర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. మానవత మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్, చైర్మన్ బాలసుబ్రమణ్యం, కేంద్ర కమిటీ సభ్యులు ప్రసాద్‌యాదవ్, సహదేవరెడ్డిలు ర్యాలీలో పాల్గొని మానవత సంస్థ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు శివయ్య, క్రిష్ణచైతన్యరెడ్డి, రమణ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక... రాఖీ పండుగ

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు


ప్రసాద్‌బాబుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

రాయచోటిటౌన్, ఆగస్టు 19: అక్కా-తమ్ముడు, అన్నా- చెల్లెలు అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు అన్నారు. సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ప్రసాద్‌బాబుకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్క-తమ్ముడు, అన్న-చెల్లెలి అనుబంధానికి ప్రతీకగా జరుపుకునేదే రాఖీ పండుగ అన్నారు. స్త్రీలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడ సమాజం మంచి మార్గంలో ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల ఫలితాలు మెరుగుపడాలి

గాలివీడు, ఆగస్టు 19: విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓలు నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం నెలవారీ సముదాయ సమావేశాల్లో భాగంగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లకు, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎస్జీటీలకు ఈ నెల 18 నుంచి 19 వరకు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్షలో భాగంగా నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహిద్దీన్, దుర్గేశ్వర్‌రాజు, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

తెప్పపై విహరించిన వేణుగోపాలుడు



వెదురుకుప్పం, ఆగస్టు 19: కార్వేటినగరంలోని రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ తెప్పోత్సవాల్లో భాగంగా సోమవారం తెప్పపై వేణుగోపాలస్వామి స్కంధపుష్కరిణిలో విహరించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు హాజరై ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల మధ్య తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు జరిగాయి. టీడీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, అర్చకులు హాజరయ్యారు.

23న గ్రామ సభలు

● డిప్యూటీ సీఎం సూచన

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19: ఈనెల 23న అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సూచించారు. సోమవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జడ్పీ సీఈవోలు, డ్వామా పీడీ, డీపీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.వేలాది కోట్లు నిధులు వెచ్చిస్తున్నామని, ప్రతి రూపాయి బాధ్యతతో ఖర్చుచేయాలని చెప్పారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అధికారులందరూ ఉపాధి పనుల నిర్వహణపై బాధ్యత తీసుకోవాలని, సోషల్ ఆడిట్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇందులో కలెక్టరేట్ నుండి డ్వామా పీడీ రాజశేఖర్, జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, పీఆర్‌ఈఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విండో'ల్లో విధిగా సభ్యులు ఈకేవైసీ చేసుకోండి

● డీఎల్‌సీవో వనజ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19: జిల్లాలోని అన్ని సింగిల్ విండోల్లో సభ్యత్వ నమోదుతోపాటు ఈకేవైసీ చేసుకోవాలని డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ వనజ అన్నారు. సోమవారం డీఎల్‌సీవో కార్యాలయంలో విండోల సీఈవోలు పర్సన్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు. ప్రతి సభ్యుడు సింగిల్ విండోల్లో త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటుహక్కు కోసం తప్పనిసరిగా రూ.300 వాటాధనం చెల్లించాలని చెప్పారు. జిల్లాలో 2.47లక్షల మంది ఇప్పటివరకు సభ్యులుగా ఉండగా, వీరిలో 90వేల మంది రూ.10 మాత్రమే వాటా రుసుం కలిగివున్నారన్నారు. వీరందరూ ఆదేశాల మేరకు అదనంగా రూ.290 వాటాధనం చెల్లించి సభ్యత్వం పొందాలని చెప్పారు. సభ్యుల వివరాలను తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకుని గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సహకారంతో సేకరించాలన్నారు. ప్రస్తుతం 14 విండోలు మాత్రమే ఎరువుల వ్యాపారం కోసం లైసెన్సులు కలిగివున్నారని, మిగిలిన 23సంఘాలు సైతం వ్యవసాయ శాఖ అధికారుల నుండి లైసెన్సులు పొందాలని చెప్పారు. జీఎస్టీ సర్టిఫికెట్లు విధిగా కలిగివుండాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను శాఖకు వ్యాపార లావాదేవీలకు సంబంధించి రిటర్న్ ఫైల్‌చేయాలని ఆదేశించారు. కస్టమర్ సర్వీసు సెంటర్ ద్వారా ఇస్తున్న లావాదేవీల సంఖ్య మరింత పెంచాలని ఆమె సూచించారు. సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి బ్రహ్మానందం, డీసీసీబీ ప్రతినిధులు, సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఐరాల మండలంలో గజదాడులు

ఐరాల, ఆగస్టు 19: ఐరాల మండలం బసివిరెడ్డిఇళ్లు, నయనంపల్లెలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి అటవీప్రాంతానికి సమీపంలోని పంట పొలాలపై దాడి చేసి వరి, అరటి, కొబ్బరి తోటలను ధ్వంసం చేశాయి. బసివిరెడ్డిఇళ్లకు చెందిన నరేంద్రకు చెందిన అరటి, వరి, భాస్కర్‌కు చెందిన వరి, నయనంపల్లెకు చెందిన రాజప్ప వరి, నయనంపల్లెకు చెందిన హేమాద్రి వరి పంట, జయచంద్రారెడ్డి కొబ్బరి తోటను ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల దాడులలో రైతులు సుమారు లక్ష రూపాయల మేర ఆస్థి నష్టం వాటిల్లింది.



బసివిరెడ్డి ఇండ్లలో ఏనుగులు తొక్కివేసిన అరటి

కూలిన చోటే.. కొత్త చిగురు..!

ఎస్వీయూలో దశాబ్దాల నాటి ఊడల మర్రి కథ ఇదీ

కూలిన చోటే.. కొత్త చిగురు వేసిన ఓ ఊడల మర్రి కథ ఇది.తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం భవన్ వద్ద ఏపుగా పెరిగి ఎన్నో పశుపక్ష్యాదులకు నెలవుగా నిలిచిన సుమారు యాభై ఏళ్ళ నాటి మర్రి చెట్టు 2023 డిసెంబరు 4వ తేదీ 110 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు (మిచౌంగ్ తుఫాన్) కూలి పోయింది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో మర్రిచెట్టుకు పైనున్న అన్ని కొమ్మలను నరికి వేసి కాండం మాత్రం వదిలి పెట్టారు. ప్రకాశం భవన్‌కు ఆనుకొని ఉన్న టెన్నిస్, వాలీ బాల్ కోర్టులకు ఎదురుగా ఉన్న ఈ మర్రిచెట్టు కూలడంతో యూనివర్సిటీ ఇంజనీరింగ్ సిబ్బంది ఆవేదన చెందారు. ఈ మర్రిచెట్టును ఎలాగైనా మళ్ళీ నిలబెట్టాలన్న ఆలోచనతో వేర్లన్నింటినీ పూడ్చి భారీ కాండం గల మర్రి చెట్టును కొంత కాలం క్రితం నిలబెట్టారు. ఈ క్రమంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మర్రి చెట్టు కొత్త చిగురు వేసింది. మన దేశ జాతీయ వృక్షంగా ఉన్న మర్రి చెట్టు కొత్త చిగురు వేయడానికి కారణమైన ఇంజనీరింగ్ సిబ్బంది, యూనివర్సిటీ అధికారుల చొరవ పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నం ద్వారా ప్రకృతి సోయగాన్ని మరింతగా పెంపొందించి అందరికీ ఆహ్లాదాన్ని పంచినట్టయ్యిందని కితాబు ఇచ్చారు.



కొత్త చిగురు వేసిన (కొత్త చిత్రం)



ఊడల మర్రి (పాత చిత్రం)

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)

ఇంకా ఎంతకాలం?

రెస్కోలో సా..గుతున్న విచారణ ● రేపు ఫిర్యాదుదారులతో భేటీ కానున్న విచారణాధికారి



కుప్పం, ఆగస్టు 19: కుప్పం రెస్కోలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై విచారణ జీడిపాకంలా సాగుతోంది. రాష్ట్ర సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని నిజాలు నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం నియమించినా, ఎందుకనో నత్తనడనక నడుస్తోంది. సంస్థను భ్రష్టు పట్టించింది ఎవరన్నది కళ్లెదుట కనిపిస్తూనే ఉంది. బాధ్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు యథావిధిగా విధుల్లో కొనసాగుతూనే ఉన్నారు. అయినా విచారణ పూర్తి కావడంలో జాప్యం జరుగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు మూడు రోజుల ముందు సంస్థలోని మొత్తం 52 మంది ఉద్యోగులు పదోన్నతులు ఇచ్చుకున్నారు. మొత్తం 122 మందిని అక్రమంగా నియమించుకోవడం, ఇద్దరు అధికారులకు రాత్రికిరాత్రి నిబంధనలకు అతీతంగా రెండుమూడు పదోన్నతులు కట్టబెట్టి, ఎండీ కుర్చీలో కూర్చోబెట్టారు. కీలకమైన సీనియర్ అసిస్టెంట్ పోస్టులో అస్మదీయులను కూర్చోబెట్టి అవినీతి, అక్రమాలకు దారి వేసుకున్నారు. రెస్కోలో మెటీరియల్ కొనుగోళ్లకు టెండర్లు లేకుండానే అస్మదీయులకు కాంట్రాక్టులు కట్టబెట్టారు. కూటమి అధికారంలోకి రాగానే వీటన్నింటిపై విచారణకు ఆదేశించింది. అప్పటి అవినీతిలో భాగస్వాములైన అధికారులను తొలుత విచారణాధికారులుగా నియమించినా.. వాస్తవాలు బయటపడడంతో వారిని పక్కన పెట్టారు. రాష్ట్ర సహకార సంఘాల అడిషనల్ రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఆమె రెండుసార్లు కుప్పం వచ్చి రెస్కో కార్యాలయంలో ఫైళ్లను తనిఖీ చేయడంతోపాటు ఉద్యోగులను విచారించారు. మధ్యలో రెండుమూడుసార్లు తిరుపతినుంచి విజిలెన్స్ అధికారులు వచ్చి తనిఖీలు చేసి, ఉద్యోగులను విచారించారు. అయినా ఇంతవరకు రెస్కోలో జరిగిన అక్రమాలు, అవినీతి చర్యల గురించి ఏ అధికారీ నిర్ధారించలేదు. ఈలోగా నాడు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెస్కో అధికారులు, ఉద్యోగులు రాజకీయాశ్రయం పొందడానికి ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి, విచారణను వేగంగా ముగించి బాధ్యులను శిక్షించకుంటే ఈ విచారణ తంతుమీదే ప్రజలకు నమ్మకం పోయే ప్రమాదం ఉంది.

ఫిర్యాదుదారులతో రేపు విచారణ

రెస్కో అవినీతిపై చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, కె.షణ్ముగం గతంలో ఫిర్యాదు చేశారు. బుధవారం జరిగే విచారణకు హాజరు కావాల్సిందిగా వీరిద్దరికీ విచారణాధికారి శ్రీలక్ష్మి నోటీసులు జారీ చేశారు. రెస్కోలో నిర్దిష్టంగా కొన్ని అవినీతి,అక్రమాలపై వీరిద్దరూ తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.ఆ ఫిర్యాదుల్లో కొన్ని..

- విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి రూ.230 కోట్ల చెల్లింపులు పెండింగులో ఉండడం.
- ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నుంచి లైసెన్సులు తీసుకోకపోవడం.
- 2021-22 ఆర్థిక సంవత్సరంలో రెస్కో రూ.5 కోట్ల నష్టాలు చవిచూడడం.
- పదవీ విరమణ చేసిన సి.సుబ్రమణ్యంను తిరిగి నిబంధనలకు వ్యతిరేకంగా ఎండీగా నియమించడం.
- అక్రమంగా ఉద్యోగుల నియామకం.. పదోన్నతులు
- ఒక ఉద్యోగికి 2020 నవంబరులో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి.. మళ్లీ అదే ఉద్యోగికి 9 నెలల్లోనే రెండో పదోన్నతి ఇచ్చి జేఏవోగా చేయడం.
- ఎండీ తన కార్యాలయాన్ని దుర్వినియోగం చేసి, ఏడాది వ్యవధిలో సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీరుగా పదోన్నతి పొందడం.

'రెవెన్యూ' సమస్యలే అధికం

చిత్తూరు, ఆగస్టు 19: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 113 సమస్యలపై అర్జీలు అందాయి. వీటిలో అత్యధికంగా 104 అర్జీలు రెవెన్యూ శాఖక సంబంధించినవే. మిగిలిన వాటిలో డీపీవోకు 2,డీఎస్‌వోకు 2, రిజిస్ట్రేషన్, ఐసీడీఎస్, హెచ్‌ఎన్‌ఎస్, సాంఘిక సంక్షేమశాఖలకు ఒక్కో అర్జీ వంతున అందాయి. ఈ అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో పుల్లయ్య, ఇతర జిల్లా అధికారులు బాధితుల నుంచి స్వీకరించారు. వారి సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

ఓడీని రద్దుచేసి మా జిల్లాకు పంపండి



ఓడిని రద్దు చేసి అనంతపురం జిల్లాకు పంపించాలని బహుళ ప్రయోజన విస్తరణాధికారుల(ఎంపీఈవోలు) అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. డిస్ట్రిక్ట్ కమిటీ ద్వారా ఎంపికై రోస్టర్ పాయింట్ల ఆధారంగా గత పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై వ్యవసాయశాఖలో పనిచేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంట విస్తీర్ణం ఎక్కువగా ఉన్నా రైతు సేవా కేంద్రాలు తక్కువగా ఉండటం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పంట విస్తీర్ణం తక్కువగా ఉన్నా రైతు సేవా కేంద్రాలు ఎక్కువగా ఉండటంతో అక్కడ్నుంచి తమను ఇక్కడికి బదిలీ చేశారన్నారు. తమకు రెన్యువల్ జీవో రానందున ఐదు నెలల నుంచి జీతాల్లేక ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లల ఫీజులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమను టీడీపీ సానుభూతి ఉద్యోగులుగా చూడటంతో పాటు సమయానికి జీతాలు ఇవ్వలేదన్నారు. అనంతపురం జిల్లా నుంచి ఓడీ(ఓన్లీ డిప్యుటేషన్) బేసిస్ మీద బదిలీ చేసి ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఓడి బేసిస్‌ను రద్దు చేసి తమను అనంతపురం జిల్లాకు బదిలీ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆ సంఘ నేతలు రెడ్డి ప్రసాద్, నరేష్‌బాబు, రోజా, వాణిశ్రీ, నాగేషు తదితరులు ఉన్నారు.

పంచాయతీలో సమస్యలు పరిష్కరించండి

ఐరాల మండలం పొలకల పంచాయతీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైస్ సర్పంచ్ బత్తల రాజేంద్రనాయుడు వినతిపత్రాన్ని అందించారు. ఆధార్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి పొలకలలోని సచివాలయం-2లో కలపాలన్నారు. 104 వాహనాన్ని కొన్ని గ్రామాలకే పరిమితం చేశారని, మిగిలిన ప్రాంతాలకూ వెళ్లేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఆ నియామకంపై చర్యలు తీసుకోండి

మసీదు కమిటీ సభ్యుల అనుమతి లేకుండా చిత్తూరు నియోజకవర్గ నయాబ్ ఖాజీగా సయ్యద్ ఇమ్రాన్‌ను నియమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మసీదు సంఘ నేతలు అత్తాబాయ్, అన్సర్‌బాయ్, జిలానీ, టైలర్ బాషా, అన్సర్, భాను, సిరాజ్ భాయ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ముస్లిం మతపెద్దలు, మసీదు కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే అనుమతి లేకుండా చిత్తూరు నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా చేసిన ఎంపిక చెల్లదన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఎస్పీకి 31 అర్జీలు



అర్జీని పరిశీలిస్తున్న ఏఎస్పీ అరీఫుల్లా

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 31 మంది బాధితులు హాజరై సమస్యలను ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఎస్పీ ఇచ్చారు. ఆయన దృష్టికి వచ్చిన సమస్యల్లో.. భూ తగాదాలు 12, కుటుంబ తగాదాలు 5, ఆస్తి తగాదాలు 5, డబ్బు తగాదాలు 4, వేధింపులు 3, బాలిక మిస్సింగ్ 1, ఇంటి తగాదాలు 1 ఉన్నాయి.

అదుపుతప్పి గోతిలో పడ్డ లారీ

● ఒకరి దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు ● క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్
● రెండుగంటల పాటు ఆర్తనాదాలు



మృతిచెందిన జ్యోతీశ్వర్



లారీ కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో కాపాడుతున్న అధికారులు

బంగారుపాళ్యం, ఆగస్టు 19: లారీ అదుపు తప్పి ముందుగా వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొంది. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఉన్న గోతిలో పడిది. ఈ ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం బంగారుపాళ్యం మండలం మొగిలి సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసాపురం నుంచి భువనేశ్వర్‌కు టమోటా సాస్ లోడ్తుతో చిత్తూరు వైపు వెళ్తున్న లారీ.. ముందు వెళ్తున్న కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో అదుపు తప్పి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గోతిలో పడింది. ఆ సమయంలో మొగిలి మిట్టూరు పంచాయతీ గాండ్లపల్లికి చెందిన కరణం జ్యోతీశ్వర్ రోడ్డు పక్కనే బాటిళ్లు ఏరుకుంటున్నారు. ఇతడిపై లారీ దూసుకెళ్లడంతో జ్యోతీశ్వర్ (55) అక్కడికక్కడే మృతిచెందారు. నెల్లూరుకు చెందిన లారీ డ్రైవర్ మస్తాన్, క్లీనర్ వెంకటసుబ్బయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. క్లీనర్‌ను స్థానికులు రక్షించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, డ్రైవర్ క్యాబిన్‌లోనే సుమారు రెండు గంటల పాటు ఇరుక్కుపోవడంతో ఆర్తనాదాలు చేశారు. పోలీసులు, స్థానికులు ఎక్స్‌కవేటర్‌తో చాకచక్యంగా క్యాబిన్‌ను తొలగించి, స్థానికులు ఇనుప రాడ్లతో తొలగించి డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయపడిన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ప్రమాదంలో లారీ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







గాయపడ్డ లారీ డ్రైవర్ మస్తాన్ - క్లీనర్ వెంకటసుబ్బయ్య - ప్రమాదానికి గురైన కంటైనర్

అక్రమ జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

● ఇద్దరు అరెస్టు



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు, ఆగస్టు 19: ఎలాంటి అనుమతుల్లేకుండా జిలెటిన్ స్టిక్స్‌ను నిల్వ ఉంచిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 76 జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం పోలీసులు వెతుకుతున్నారు. చిత్తూరు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. చిత్తూరు నగరం తేనబండ సమీపంలోని బోడికొండ ప్రాంతంలో అక్రమంగా జిలెటిన్ స్టిక్స్‌ను నిల్వ ఉంచారని సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐలు ప్రసాద్, సుగుణ, సిబ్బంది బోడికొండ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో తమిళనాడు రాష్ట్రం తిరుత్తూరు తాలూకాకు చెందిన గోవిందన్(49), రమేష్‌లను పోలీసులు పట్టుకున్నారు. వారు అక్రమంగా నిల్వ ఉంచిన 76 జిలెటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. శివాజీ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. జిలెటిన్ స్టిక్స్‌ను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారని సీఐ తెలిపారు.

21 నుంచి ఓటరు నమోదుకు ఇంటింటి సర్వే

● డీఆర్వో పుల్లయ్య



రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 19: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 21వ తేది నుంచి నెలరోజుల పాటు బీఎల్వోలచే ఓటరు నమోదుకోసం ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. డీఆర్వో మాట్లాడుతూ 2025జనవరి 1నాటికి 18 ఏళ్ళు నిండనున్న యువతీయువకులు ఓటరుగా ఇప్పుడే నమోదు చేసుకోవచ్చన్నారు. పాత ఓటరు జాబితాలో సవరణలు కూడా చేసుకోవచ్చని తెలిపారు. అక్టోబరు 29న ముసాయిదా ఓటర్ల జాబితా, 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని వివరించారు. ఓటరు గుర్తింపుకార్డులో ఫొటో సక్రమంగా లేకపోయినా, ఒకే కుటుంబానికి చెందిన సభ్యులకు వివిధ పోలింగ్ స్టేషన్లలో గుర్తింపు కార్డులు ఉంటే వాటి పరిష్కారానికి ఈసీఐ ఇప్పుడు అవకాశం కల్పించిందన్నారు. నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), సురేంద్రకుమార్ (టీడీపీ), పరదేశి (కాంగ్రెస్), గంగరాజు (సీపీఐ), ఉదయ్ కుమార్ (వైసీపీ)లు పాల్గొన్నారు.

హత్య కేసులో అన్న అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

పెద్దపంజాణి, ఆగస్టు 19: తమ్ముడిని హతమార్చిన అన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మురళీమోహన్ తెలిపిన ప్రకారం.. పెద్దపంజాణి మండలం మట్టుగానిపల్లె గ్రామంలో ఆస్తి తగాదాలలో తమ్ముడు చెంగప్పను అన్న వెంకట్రమణ శనివారం హతమార్చిన విషయం తెలిసిందే. మృతుడి కుమార్తె ప్రభావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానికుల సమాచారం మేరకు పలమనేరు- పుంగనూరు జాతీయ రహదారిలో తులమ్మగుడి బస్‌స్టాప్ వద్ద వెంకట్రమణ ఉండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ సహదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి



రామ్‌ముర్ము (ఫైల్‌ఫొటో)

వాల్మీకిపురం, ఆగస్టు 19: ప్రమాదవశాత్తు రైలు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం వాల్మీకిపురం మండలంలో చోటుచేసుకుంది. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు..జార్ఖండ్ రాష్ట్రం సారక్ గట్టుకు చెందిన లక్ష్మీముర్మ కుమారుడు రామ్‌ముర్ము(30) మండలంలోని మద్దెలచెరువుపల్లె కంకర మిషన్ నందు కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు చింతపర్తి సమీపంలోని రైల్వే గేట్ దాటుకుని సమీపంలో గల చెరువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో రామ్‌ముర్ము అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్‌ఐ రహీం సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, రామ్‌ముర్ము మృతి చెందిన విషయమై అతని కుటుంబీకులకు సమాచారం అందించారు.

పొట్టేళ్ల దాడిలో మహిళకు తీవ్రగాయాలు

ములకలచెరువు, ఆగస్టు 19: పొట్లాడుతున్న పొట్టేళ్లను అడ్డుకునేందుకు యత్నించిన మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన సోమవారం జరిగింది. ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ ఎర్రగుడివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి భార్య సిద్ధమ్మ(55) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం గొర్రెల మందలోని రెండు పొట్టేళ్లు తీవ్రంగా పొట్లాకుంటుండగా గమనించి న సిద్ధమ్మ అడ్డుతగిలింది. దీంతో రెండు పొట్టేళ్లు ఆమె మీద దాడి చేయడంతో చేతులు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్సల నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ గురునాథ్

కలకడ, ఆగస్టు 19:రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పని సరిగా పాటించాలని సీఐ గురునాథ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ-రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే నిబంధనలను పాటించని వాహనదారులకు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామాంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక దందా వైసీపీ నేతలదే..

● టీడీపీ నేత ఆర్జే వెంకటేశ్ ధ్వజం

మదనపల్లె టౌన్, ఆగస్టు 19: మదనపల్లెలో కొందరు వైసీపీ నాయకులు రంగులు మార్చుకుని నిమ్మనపల్లె నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తూ ఈ బురదను టీడీపీ నాయకులపై వేయడం పద్ధతి కాదని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాసం వద్ద టీడీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ గతంలో పెద్దిరెడ్డి బినామీలు ఇసుక అక్రమ రవాణా చేశారని, ఇప్పుడు రంగులు మార్చుకుని మళ్లీ ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ నిందను టీడీపీ నాయకుడు షంషీర్‌పై వేస్తున్నారన్నారు. మదనపల్లె ప్రాంతంలో ఇసుక రీచ్ లేనందున కొంత మంది వంకలు, వాగుల్లో ఇసుకను ట్రాక్టర్లలో నింపి పట్టణంలో భవన నిర్మాణాలకు తోలుతున్నారని, దీని వలన పట్టణంలో ఇసుక డిమాండ్ తగ్గుతోందన్నారు. టీడీపీ నాయకుడు షంషీర్ మాట్లాడుతూ తనపై ఆరోపణలు చేస్తున్న వ్యక్తి చౌడేశ్వరి ఆలయం వద్ద గతంలో ఇలాగే ఆరోపణలు చేస్తూ దందాలు చేసి దెబ్బలు తిన్నాడన్నారు. ఎవరు తప్పు చేసినా సీఎం చంద్రబాబు వదలరన్నారు. టీడీపీ నాయకులపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు చెడ్డపేరు తెచ్చేందుకే కొందరు ఇలా ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాదెళ్ల శివన్న, బొమ్మనచెరువు ముద్దుకృష్ణమనాయుడు, సుద్దిళ్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మిట్స్ విద్యార్థినికి బంగారు పతకం



కురబలకోట, ఆగస్టు 19: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని మౌనిక రోప్ స్కిప్పింగ్ పోటీలలో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో సీఎస్‌ఈ రెండవ సంవత్సరానికి చెందిన విద్యార్థిని మౌనిక ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయిలో జరిగిన క్రీడా పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారన్నారు. కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, పీడీ దామోదరన్, విక్రమ్ తదితరులు అభినందించారు.

23 నుంచి గ్రామసభలు

వాల్మీకిపురం, ఆగస్టు 19: మండలంలో ఈనెల 23 నుంచి జరుగనున్న గ్రామ సభలు, నిర్వహణ చేపట్టాల్సిన అంశాలు, ఉపాధి పథకం, వికసిత్ భారత్ తదితర వాటి అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వాల్మీకిపురం మండల స్థాయి అధికారులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీవో మనోహర్‌రాజు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

తంబళ్లపల్లె, ఆగస్టు 19: తంబళ్లపల్లె మండలంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగసభ మంగళవారం వెలుగు, ఉపాధి కార్యాలయాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఏపీవో అంజినప్ప తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి ఈఏడాది మార్చి 31 వరకు మండలంలో ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ బృందం సర్వే నిర్వహించగా వివరాలను బహిరంగసభలో వివరిస్తారన్నారు.

ప్రజా ఫిర్యాదుల వెల్లువ

●మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు మూడు వారాల్లో 250 పైగా అర్జీలు ●గతంతో పోలిస్తే 100 శాతం అధికం



గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఆగస్టు 19: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల (పబ్లిక్ గ్రీవె రిడ్రెసల్ సిస్టం..పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి అర్జీ లు వెల్లువలా వస్తున్నాయి. గత ఎన్నికల ముందు ప్రతి సోమవారం ఆర్డీవో కార్యాలయానికి 25 నుంచి 35 వరకు మాత్రమే అర్జీలు వచ్చేవి. ఈ క్రమంలో మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం ఘటన, దీనిపై రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరి సిసోడియా స్వయంగా వచ్చి ప్రజల నుం చి భూ ఆక్రమణలు, దందాలపై అర్జీలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదనపల్లె సబ్‌కలెకర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో మూడు వారాల పాటు ప్రతి సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమం లో 70 నుంచి 80 చొప్పున ఇప్పటి వరకు ప్రజల నుంచి 250 పైగా అర్జీ లు వచ్చాయి. సోమవారం సబ్‌కలెక్టరేట్ నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి 73 మంది అర్జీలు అందించారు. నిమ్మనపల్లె మండలం అగ్రహారం పంచాయతీ మంచికుంటపల్లెకు వెళ్లే దారిని ఓ వ్యక్తి తన సొంత భూమి అని చెబుతూ దున్నేసి గ్రామానికి దారి లేకుండా చేశాడని గ్రామస్థులు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్మికుల కోసం ప్రభుత్వం మదనపల్లెలో ఏర్పాటు చేసిన ఈఎస్‌ఐ క్లినిక్‌లో కార్మికులకు సరిగ్గా వైద్యం అందలేదని, రోగులకు మందులు ఇచ్చే పరిస్థితి లేదని మున్సిపల్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు ఫిర్యాదు చేశారు. తమ వేతనాల్లో ఈఎస్‌ఐ కోసం డబ్బులు కట్ చేస్తున్నా, ఏదైనా జబ్బు చేస్తే తిరుపతి, బెంగళూరుకు రెఫర్ చేస్తున్నారని కార్మికులు ఆరోపించారు. పోలీసు హోంగార్డులకు గతంలో భూమి కేటాయించిన విషయంలో అలీనేషన్ చేశారని, తమ వద్ద అంత డబ్బులు లేవని అలీనేషన్ ప్రతిపాదనలు రద్దు చేయాలని మదనపల్లె మండలం హోమ్‌గార్డ్స్ అసోసియేషన్ నాయకులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. తమకు కోర్టు ఆర్డర్ ఉన్నా తమ అధీనంలోని భూమికిలోకి వెళ్లనీయకుండా కొందరు అడ్డగించి దౌర్జన్యం చేస్తున్నారని రామసముద్రం మండలం పూలకుంట్లపల్లె గ్రామానికి చెందిన రైతు టి.శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా బాధితులకు సబ్‌కలెక్టర్ సూచించారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యాల నుంచి కాపాడండి

మదనపల్లె టౌన్, ఆగస్టు 19: గత 25 ఏళ్లుగా అనుభవిస్తున్న భూమిలోకి వెళ్లనీయకుండా వైసీపీ నాయకులు దారి లేకుండా చేశారని ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లెకు చెందిన రైతు వెంకటరమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు వచ్చిన బాధితుడు మాట్లాడుతూ తాము 1999 లో భూమి కొనుగోలు చేశామని, ఐదేళ్లుగా ఈ భూమిని విక్రయించమని వైసీపీ నాయకులు బలవతం చేశారన్నారు. తాము ఒప్పుకోనందుకు తమ భూమికి వెళ్లనీయకుండా కంచె వేసేశారన్నారు. అప్పట్లో ఈ విషయమై ములకలచెరువు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానన్నారు. ప్రభుత్వం తమకు రక్షణ కల్పించి, తమ భూమికి దారి కల్పించాలని బాధితుడు వెంకటరమణరెడ్డి వివరించాడు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశాడు.

పంచాయతీలలో సర్పంచ్‌లదే కీలక పాత్ర



పీటీఎంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలాజీ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 19 : పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని మండల అభివృద్ధి అధికారి కేఎన్ బాలాజీ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల పరిషత్ అధ్యక్షుడు మహమూద్, ఎంపీడీవో బాలాజీ, మండల విస్తరణాధికారి యోగానంద్, మండల ఇంజనీరింగ్ అధికారి నిరంజన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, వీధి దీపాల నిర్వహణ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ తప్పని సరిగా చేపట్టాలని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు విధులు, నిధులు, విధివిధానాలు తెలుసుకోవాలని సర్పంచుల శిక్షణ తరగతులలో ట్రైనర్లు మారప్ప, గిరిధర్‌నాయక్ పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాయలంలో మూడు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ఎంపీడీవో శ్రీధర్‌రావు ప్రారంబించారు. ఈ సందర్భంగా ట్రైనర్స్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ నిధులతో గ్రామాభివృద్ధికి కృషిచేయాలన్నారు. సర్పంచులు నటరాజ్‌నాయక్, బాషా, బయ్యారెడ్డి, విశ్వనాధరెడ్డి, జింక విశ్వనాధ, వాసవి కార్యదర్శులు జగన్, జనార్ధన, శైలజ, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లు, కార్యదర్శుల విధులు బాధ్యతలపై సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భానుప్రసాద్ అధ్యక్షతన మూడు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తూ తాగునీరు, మురుగు కాలువల ఏర్పాటు, వీధి లైట్లు తదితర వాటి పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణా తరగతులకు విధిగా హాజరు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవో పీఆర్డీ సుధాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రమణ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కలకడలో:గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకమని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంటులకు మొదటి రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పరిపాలన, పంచాయతీ ఆర్థికాభివృద్ధి వనరులపై అవగాహన కల్పించారు. ఈవోఆర్డీ లతీఫ్‌ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

కురబలకోటలో: గ్రామాల్లో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోలు హరినారాయణ, దిలీప్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కురబలకోట, తంబళ్లపల్లె పంచాయతీ కార్యదర్శులకు శిక్షణాతరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులదే కీలకపాత్ర అని, పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలన్నారు. పరిపాలన, పారిశుధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరా చెత్త సంపద కేంద్రాలను వినియోగించడంపై తెలియజేశారు.

గ్రామాల్లో పరిశుభ్రత లోపిస్తే చర్యలు తప్పవు


ములకలచెరువు, ఆగస్టు 19: గ్రామాల్లో పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్ప వని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుభ్రత లోపించకుండా ప్రతి ఒక్కరు ఎప్పటికప్పుడు మెరుగుపరచాలన్నారు. సర్పంచులు, కార్యదర్శులకు జరిగే శిక్షణా తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సాయిలీల, ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ వేడుకలు



ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు రాఖీ కడుతున్న మున్సిపల్ కౌన్సిలర్ తులసి

మదనపల్లె టౌన్/అర్బన్, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమి సందర్భంగా రాఖీ పండుగను మదనపల్లెలో పలు ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక కురవంక సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతికి మున్సిపల్ కౌన్సిలర్ తులసి రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. పలువురు డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న ఆధునిక సమాజంలో అన్నా చెల్లెలు, అక్కా తమ్ముడు బంధాలను గుర్తు చేసే రాఖీ పండుగలను అందరు జరుపుకోవాలన్నారు. అనంతరం మండలంలోని అంకిశెట్టిపల్లెలో టీడీపీ నేత జేవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరంలో స్వాస్త్య ఆస్పత్రి వైద్యులు 153 మందికి ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. స్టంట్లు అవసరమైన ముగ్గురిని కోలారు జాలప్ప ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తారని టీడీపీ ఇన్‌చార్జి జేవీ రమణ పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆర్‌కే రామకృష్ణాచారి, కురవంక మోహన పాల్గొన్నారు. మదనపల్లె పట్టణం నీరుగుట్టువారిపల్లె చౌడేశ్వరీ సర్కిల్‌లోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో రాఖీ పౌర్ణమి పూజలు ఆలయ ధర్మకర్త గుడి రామాంజుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక మల్లికార్జున సర్కిల్‌లో వరాల ఆంజనేయస్వామిని టమోటాలతో విశేషంగా ఆలయకమిటీ సభ్యులు అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. సాయంత్రం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరణలు చేసి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



ఎస్‌ఐ నాగేశ్వర్‌రావ్‌కు రాఖీ కడుతున్న విద్యార్థిని

వాల్మీకిపురంలో: సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్ అని వాల్మీకిపు రం ఎస్‌ఐ నాగేశ్వర్‌రావ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పోలీస్‌స్టేషన్ నందు ఎస్‌ఐ, సిబ్బందికి రాఖీలు కట్టి స్వీట్లు అందజేసి వారి నుంచి దీవెనలు అందుకున్నారు. అనంతరం 104 వైద్య సిబ్బందికి కూడా రాఖీలు కట్టారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, ఆగస్టు 19: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహాలయంలో సోమవారం పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అభయాంజనేయస్వామికి అభిషేకం, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం స్వామివారికి ఆకుపూజ, సింధూర పూజ, వడమాల, తోమాలసేవలతో పున్నమి వెలుగులో విశేష భక్తజనం నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రత వేడుకలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పురాతన చెన్నరాయస్వామి ఆలయ పునరుద్ధరణకు సహకరించండి

రామసముద్రం, ఆగస్టు 19: మండలంలోని కురిజల గ్రామంలో శిథిలావస్థకు చేరిన పురాతన చారిత్రకమైన చెన్నరాయస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు ప్రారంభించడానికి అనుమతి ఇవ్వాలని గ్రామస్థులు కోరారు. ఆమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌కు వారొక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలంలో స్వామివారికి నిత్య పూజలు జరిగేవని, అయితే గత 30ఏళ్లుగా ఈ గుడిలో పూజలు జరగక శిథిలావస్థకు చేరిందని పేర్కొన్నారు. గ్రామస్థులు ఐక్యమత్యంతో నూతన ఆలయ నిర్మాణం చేయడానికి నిర్ణయం తీసుకున్నామని ఇందుకు అనుమతులు మంజూరు చేయాలని వారు ఆవినతిలో కోరారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం

తంబళ్లపల్లె, ఆగస్టు 19: తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో కొలువై ఉన్న భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడి పంటలతో, ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఏటా మల్లయ్యకొండ పైన కుంభాభిషేం నిర్వహిస్తారు. ఈ ఏడాది దేవదాయశాఖ ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో కుంభాభిషేక ఘట్టాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కుంభాభిషేక మహోత్సవాన్ని తిలకించేందుకు అన్నమయ్య జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మల్లయ్యకొండ పైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది కొంటకిట్ట, ఈశ్వర, భక్తులు పాల్గొన్నారు.

పీటీఎం శివాలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 19 : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పీటీఎంకు చెందిన ఆధ్యాత్మికవేత్త అయిన సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో శివుడికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు మణికంఠశర్మ, సత్యనారాయణ శర్మలు ఆల యంలో సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

వరి పైరుకు అగ్గి తెగులు

కలికిరి, ఆగస్టు 19: వరి పైరులో అగ్గి తెగులు విస్తారంగా సోకిందని కలికిరి కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ మంజుల పేర్కొన్నారు. సోమవారం ఆమె మండలంలోని మేడికుర్తి పరిసరాల్లో పలు గ్రామాల్లో సాగుచేసిన వరి పొలాలను శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. వరిలో జింకు లోపం కూడా తీవ్రంగా ఉందని దీని నివారణకు లీటరు నీటికి 13:0:45 ఐదు గ్రాముల వంతున కలిపి పిచికారీ చేసి వారం రోజుల తరువాత జింక్ సల్ఫేటు లీటరుకు 5 గ్రాముల వంతున పిచికారీ చేయాలన్నారు. ఇక వరిలో అగ్గి తెగులు కారణంగా తీవ్రంగా నష్టపోయే అవకాశాలున్నాయని హెచ్చరించారు. వరి పంట ఆకులపై ముదురు గోధుమ రంగు అంచుతో మధ్యలో బూడిద రంగులో నూలు కండె ఆకారంలో మచ్చలుంటే అగ్గి తెగులు సోకిందని నిర్ధారించుకోవచ్చన్నారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని వివరించారు. వేరుశెనగ పొలాల్లో కాండం కుళ్ళు వైరస్ తెగులు బాగా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. వయ్యారి భామ కలుపు మొక్కలు (పార్థీనియం) విస్తరించిన కారణంగానే కాండం కుళ్ళు సోకుతుందని మంజుల వెల్లడించారు. శాస్త్రవేత్తలు సోమశేఖర్ బాబు, మాధురి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఫైళ్ల దహనం కేసులో నిందితుల అరెస్టు ఎప్పుడో..?



సబ్‌కలెక్టర్‌కు వినతి అందజేసిన అనంతరం మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 19: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటన జరిగి నెల రోజులవుతున్నా ఇంతవరకు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి ప్రశ్నించారు. సోమవారం సీపీఐ నాయకులు స్థానిక సబ్‌కలెక్టర్‌ను కలసిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో వందల కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు భూములు కబ్జాలకు గురయ్యాయన్నారు. సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల విచారణతో తొలుత చూపించిన చొరవ ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. ఈ కేసుల్లో నిందితులు బయట తిరుగుతున్నారని, వారిని అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ప్రైవేటు భూములు కబ్జాలు చేసిన వారిపై చర్యలు తీసుకుని, అసలైన భూబాధితులను న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాధవ్, తిరమలయ్య, సురేంద్ర, కమలాకర్ పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో అసాంఘిక కార్యక్రమాలపై చర్యలు



ప్రభుత్వాస్పత్రి ఆవరణను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాజు

మదనపల్లె టౌన్, ఆగస్టు 19: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌ఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం ఆస్పత్రి ఆవరణలో పర్యటించిన ఆయన అక్కడ మద్యం బాటిళ్లు పడి ఉండటాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు రాత్రి పూట ఇక్కడికి వచ్చి మద్యం తాగుతున్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇస్తామని, రాత్రి పూట ఆస్పత్రి ఆవరణలో బీట్ నిర్వహించాలని కోరుతామన్నారు. అలాగే క్యాజువాలిటీ బయట అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి ప్రజలకు పోలీసులు కనపడేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరామన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ఆస్పత్రిలో వర్షపు నీరు చేరినా బయటకు తోడేశామని, ఎలాంటి పరికరాలు నష్టం కాలేదన్నారు. పైభాగాన గదులు మరమ్మతులు చేయాలని ఏపీఎంఎస్‌ఐడీసీ అధికారులకు నివేదికలు పంపామన్నారు. ఆప్కాస్ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల వేతనాలు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఆస్పత్రి నుంచి తిరుపతికి రెఫర్ చేసే కేసులకు సంబందించి ఆయా విభాగాధిపతులు తప్పని సరిగా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాల్సిందిగా ఆదేశించామన్నారు. అలాగే రోగులను ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌కు రెఫర్ చేసే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడానికి ఒక కమిటిని వేస్తామని డాక్టర్ రాజు తెలిపారు.

గ్రామీణులకు అందుబాటులో కల్యాణ మండపం



కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఆగస్టు 19: అంకాలమ్మ దేవత పేరుతో నిర్మించిన కల్యాణ మండపాన్ని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంచాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సూచించారు. పదేళ్ళ క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో పర్యాటక శాఖా కింద మంజూరైన నిధులతోఈ కల్యాణ మండపం పూర్తి చేసుకుని ప్రజలు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. రూ.3.50 కోట్ల వ్యవయంతో స్థానిక గ్రామ దేవత అంకాలమ్మ ఆలయానికి చెందిన 4.50 ఎకరాల స్థలంలో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించగా సోమవారం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ మండపం ద్వారా వచ్చే ఆదాయంతో అంకాలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కమిటీకి సూచించారు. అనంతరం కల్యాణ వేదికపై శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి తనూజా రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు ఇంజినీరు రమేష్ రెడ్డి, వాసునూరి చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అన్నదానం చేశారు.

మదనపల్లె-తరిగొండ బస్సు ప్రారంభం



కురబలకోట, ఆగస్టు 19: మదనపల్లె-తరిగొండ మధ్య ఆర్టీసీ బస్సును టీడీపీ నేతలు ప్రారంభించారు. మదనపల్లె నుంచి ముదివేడు, మట్లివారిపల్లె, మీదగా తరిగొండకు చేరు కుంటుంది. కాగా బస్సును ఇదివరలో రద్దు చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్‌లు రాష్ట్ర రవాణాశాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ప్రజల సౌకర్యార్థం ఆ బస్సును పునరుద్ధరించడంతో టీడీపీ నేతలు తంబళ్లపల్లె తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాధ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికా రు. కాగా బస్సును తిరిగి పునరుద్ధరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా అన్నదానం



వెలుగు ప్రత్యేక పాఠశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19: ప్రపంచ ఫొటో గ్రఫీ డేని పురస్కరించుకుని మదనపల్లె ఫొటో స్టుడియో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొని వెలుగు సంస్థను నిర్వహిస్తున్న ఉదయ్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. దివ్యాంగ పిల్లలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ శివప్రసాద్, ఫొటో స్టుడియో అసోసియేషన్ నేతలు పార్థసారథి, మధు, జేసీబీ వేణు, రఘునాథనాయుడు, స్వామి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు సన్మానం



ఎస్‌ఐ లోకేష్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

తంబళ్లపల్లె, ఆగస్టు 19: తంబళ్లపల్లె మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు హరిప్రసాద్, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, ఎంపీడీవో సురేంద్రనాథ్‌లను తంబళ్లపల్లె టీడీపీ నేతలు ఘనంగా సత్కరించారు. సోమవారం టీడీపీ నేతలు వారి కార్యాలయాలకు వెళ్లి తంబళ్లపల్లె మండలానికి వచ్చినందుకు అభినందనలు తెలిపి దుశ్శాలువలు, పూలమాలలతో సన్మానించారు. అధికారులను కలిసిన వారిలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్ధమ్మ, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, ఉత్తమ్‌రెడ్డి, సుధాకర్, జగదీష్, భాస్కర్, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలను వేయించుకోండి

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 19 : మండలంలోని పాడిరైతులు పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను తప్పకుండా వేయించాలని మండల పశువైద్యాధికారి రమేష్‌నాయక్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఈనెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ సమీపంలోని పశువైద్యశాలల్లో గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19: ఆర్టీసీ ఉద్యోగులు సమయపాలన పాటించి డిపోలో ఆదర్శంగా నిల వాలని వన్ డిపో డీఎం మూరే వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వన్ డిపో కార్యాలయంలో తక్కువ కేఎంపీఎల్ సాధించిన వారికి ట్రైనింగ్ ఇచ్చారు. ఆర్టీసీలో అధికంగా కేఎంపీఎల్ సాధించడానికి ట్రాఫిక్ సూపర్‌వైజర్లు పూర్తి సహకారం అందించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వన్, టూ డిపోల అసిస్టెంట్ మేనేజర్లు రేవతి, గీతా, ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

కన్నెమడుగు సంఘమిత్రగా సుజన

తంబళ్లపల్లె, ఆగస్టు 19: తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు వెలుగు సంఘమిత్రగా కే.రామిగానిపల్లెకు చెందిన రేపన సుజన ఎంపికయ్యారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు అంశీరాబేగం, భద్రయ్య ఆధ్వర్యంలో కన్నెమడుగు సంఘమిత్రగా సుజనను సంఘ సభ్యులు ఎంపిక చేసుకున్నారు. కాగా, గతంలో ఇక్కడ సంఘమిత్రగా పనిచేస్తున్న వసంతకుమార్‌రెడ్డి కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన స్థానంలో వీవో సభ్యులు సుజనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.